



అమ్మో.. అమెరికానా ?





అటు ఉపాధి కోసం.. ఇటు ఉన్నత చదువులు, ఆపై మెరుగైన జీవితం కోసం.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఏటా వందల సంఖ్యలో ఇతర దేశాలకు వలస వెళుతున్నారు. ఇలా వెళ్లిన వారిలో కొద్ది మంది మాత్రమే తాము అనుకున్న లక్ష్యాలను చేరుకుంటున్నారు. ఎక్కువ మంది మోసాలకు గురవుతూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయంతో విదేశీయానంపై ఆశలు సన్నగిల్లాయి. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

చెదురుతున్న విదేశీయానం కలలు

గుబులు రేపుతున్న ట్రంప్ నిర్ణయం

అక్కడ చదువుతున్న.. ఉద్యోగాలు చేస్తున్న జిల్లావాసుల కుటుంబీకుల్లో ఆందోళనలు

గల్ఫ్ దేశాలపట్ల పెరుగుతున్న విముఖత

ఏజెంట్లు, దళారుల చేతుల్లో మోసాలు

ఉపాధి అవకాశాల పేరిట విజిటింగ్ వీసాలు

అక్కడకు వెళ్లి ఇరుక్కుపోతున్న బాధితులు

పాలకొల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో అమెరికా డ్రీమ్ చాలా మంది కల. మా అబ్బాయిని ఉన్నత చదువుల కోసం అమెరికా పంపించా. చదువు పూర్తి చేసుకుని అక్కడే జాబ్ చేస్తున్నాడు. మా అమ్మాయికి అమెరికా సంబంధం చూసి పెళ్లి చేశా. వారికి పుట్టబోయే బిడ్డకు అమెరికా సిటిజనే అంటూ చాలా కుటుంబాలు గర్వంగా.. గొప్పగా చెప్పుకోవడం చూ శాం. వీరిని చూసి మిగిలిన వారు.. తమ పిల్లలను అదే బాట పట్టించాలని ఉవ్విళ్లూరిన వారిని చూశాం. అమెరికా కాకపోయినా, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్ వంటి దేశాలకు పంపించిన వారూ మన చుట్టూనే ఉన్నారు. ఇలా ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రతి ఊరి నుంచి ఒకరో, ఇద్దరో అమెరికాతోపాటు ఇతర దేశాల్లో ఉద్యోగాలు, చదువుల నిమిత్తం ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

ట్రంప్ రాకతో మారిన పరిస్థితులు

అమెరికా సంయుక్త రాష్ట్రాలను స్వర్గధామంగా భావించే మనవాళ్లు.. అక్కడ ఉపాధి పొందడానికి ఉవ్విళ్లూరుతారు. ఇది మొన్నటి వరకు వున్న పరిస్థితి. ఇప్పుడు పరిస్థితి మారింది. అమెరికా పేరెత్తితే చాలు.. అమ్మో.. అమెరికానా..? అంటూ వెనకడుగు వేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడమే ఇందుకు కారణం. 'అమెరికానే ఫస్ట్' అంటూ నినాదంతో గెలిచిన ట్రంప్.. ఉద్యోగాలు చేస్తున్న అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపించారు. భారతీయులు వేలల్లో ఉన్నారని ప్రకటించారు. వీరిలో తొలి విడతగా 104 మందిని మనం తిరిగి పంపించారు. మలి విడతల్లో మరింత మంది వచ్చే అవకాశాలు ఉన్నాయి. వీరిలో మన జిల్లావాసులు ఉండే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.



అమెరికానా.. వద్దులే..!

అమెరికా కలలు కల్లలు అవుతుండడం, అక్కడ చదువు కోసం వెళుతున్న వారి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మొన్నటి వరకు చదువుకుంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకునే, తమ ఖర్చులకు తామే సంపాదించుకునే వారు. ఇక్కడి నుంచి తల్లిదండ్రులు సొమ్ములు పంపించే అవకాశం ఉండేది కాదు. కాని, ఇప్పుడక్కడ అలాంటి పరిస్థితి లేదు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడంతో పాటు చదువుకున్న తర్వాత వెంటనే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు. డాలర్ డ్రీమ్స్ క్రమంగా సన్నగిల్లడంతో 'అమెరికానా.. వద్దులే' అనే ధోరణి కనిపిస్తోంది. ఎలాగైనా విదేశాల్లో చదువుకుని అక్కడే ఉద్యోగాలు చేసి, స్థిరపడాలనుకునే వారు అమెరికా తర్వాత ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, స్వీడన్, ఫ్రాన్స్, పోలాండ్ వంటి దేశాలపై మక్కువ చూపేవారు. ఇప్పుడు అక్కడ కూడా ఉద్యోగ అవకాశాలు ఘణనీయంగా తగ్గిపోవడం, వెళ్లిన వారు ఖాళీగా ఉండడంతో వీటిపైనా ఆసక్తి సన్నగిల్లింది. అదేదో మన దేశంలోనే ఉండి ఇక్కడే చదువుకుందామనే వారి సంఖ్య పెరుగుతోంది.

సాఫ్ట్‌వేర్‌పై మోజు వదలాలి



సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల మోజు లో ఇతర రంగాల ప్రాముఖ్యతను గుర్తించకపోవడం ఈ పరిస్థితి నెలకొంది. భారతీయ విద్యార్థులు చదువుకుంటూనే పార్ట్ టైమ్ ఉద్యోగాలను యూనివర్సిటీ పరిధిని దాటి చేస్తున్న కొందరిని అక్రమ వలసదారులుగా గుర్తించి పంపిస్తున్నారు. ఇది ఆందోళన కలిగిస్తోంది. భారతీయుల చదువు, ఉద్యోగాల ఎంపికలో మార్పు రానంత వరకూ ఇక్కడ ఈ సమస్య ఇలానే వుంటుంది. ఇటీవల అమెరికా జారీచేసిన హెచ్ 1బీ వీసాలు ఒక్క భారతీయులకే 75 శాతం అందజేసింది. సాఫ్ట్‌వేర్‌కు మించిన అవకాశాలు వున్న రంగాలు చాలా ఉన్నాయి. వాటిపై దృష్టి పెడితే మంచి భవిష్యత్ వుంటుంది.

- సాకేత్ దేశ్‌ముఖ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కాలిఫోర్నియా

- తణుకు యువకుడు దుబాయ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఏడాదిపాటు అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. తర్వాత కెనడా వెళ్లి 90 శాతం మార్కులతో ఎంఎస్ పూర్తి చేసి ఏడాది గడిచినా.. ఇప్పటికీ ఉద్యోగం రాలేదు.
- గుంటూరు యువకుడు ఏడాదిన్నరగా కెనడాలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వీసా గడువు ముగుస్తోంది. పొడిగింపునకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చేసేది లేక ఇండియా వచ్చేస్తున్నాడు.

గల్ఫ్ దేశాల మాటేమిటి ?

మన దేశం రూపాయితో పోలిస్తే విదేశీ కరెన్సీ దినార్, రీల్, పౌండ్, డాలర్, యూరో విలువ ఎక్కువ. అక్కడ ఒక్కో కరెన్సీ విలువ ఇక్కడ వందతో సమానం..! ఇక్కడ నెల రోజులు కష్టపడితే వచ్చే ఆదాయం అక్కడ అది వారం, పది రోజుల్లోనే సంపాదించవచ్చు. ఇక్కడితో పోలిస్తే అక్కడ ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఈ కారణాలతో నిన్న మొన్నటి వరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ప్రతి నెలా వందలాది మంది ప్లంబర్స్, టైలర్స్ తాపీ పని వాళ్లు, కారు డ్రైవర్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్స్, ఫ్యాక్టరీల్లో పనిచేసే వర్కర్లు, ఇంటి పనుల కోసం దుబాయి, ఖతార్, ఒమన్, బెహరైన్, సౌదీ అరేబియా, మస్కట్, కువైట్, అబుదాబి వంటి గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు. వీరంతా ఐదారేళ్లు అక్కడే ఉండి రెండు చేతులా సంపాదించుకుని తిరిగి వచ్చేవారు. వీరిని చూసి మిగిలిన వాళ్లు వీరిని

(మిగతా 8వ పేజీలో)

కొంత కాలం తప్పదు



దావులూరి జ్యోతి
పెన్సిల్వేనియా స్టేట్, మెకానిక్స్ బర్గ్, అమెరికా

'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గుర్తింపు కోసమే నిబంధనలు కఠినతరం చేశారు. ఉన్నత విద్యకు అమెరికా వచ్చే మనవాళ్లు గతంలో పార్ట్‌టైమ్ జాబ్ చేసేవారు. ఇప్పుడు దీనిని వారానికి 20 గంటలకు కుదించారు. అదీ యూనివర్శిటీ క్యాంపస్‌కే పరిమితం చేశారు. అయితే ట్రంప్ నిర్ణయాలు కొంతకాలమే ఉంటాయి. వలస కార్మికులు ఇక్కడికి రాకుంటే మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. ఇక్కడ ఎంఎస్ పూర్తిచేసిన భారత సంతతికి ప్రస్తుతం ఉద్యోగ అవ కాశాలు తక్కువగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో అమెరికా కంపెనీలు అవసరం మేరకు తీసుకోవాలి. లేదంటే అగ్ర రాజ్యం హోదా కోల్పోతుంది. కాబట్టి ఇప్పుడున్న కఠిన నిబంధనలు ఖచ్చితంగా తొలగిస్తారు. యువకులు విద్య ఉపాధి కోసం సక్రమమైన మార్గంలో వస్తుంటే మరికొందరు తగిన ఎడ్యుకేషన్ లేనప్పటికీ అక్రమ పద్ధతుల్లో మెక్సికో మీదుగా అమెరికాలో ప్రవేశిస్తున్నారు. అలాంటి వారినే ట్రంప్ ప్రభుత్వం వెనక్కి పంపిస్తోంది' అని తణుకు ప్రాంతానికి చెందిన దావులూరి జ్యోతి తెలిపారు. 15 ఏళ్ల క్రితం ఆమె అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. భర్త డాక్టరు కాగా, ఆమె సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నారు. అక్కడి పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు.

ఏజెంట్ చేతిలో మోసపోయా..

యలమంచిలి మండలానికి చెందిన ప్రకాశ్ ఉపాధి కోసం రెండు లక్షలు ఇస్తే మలేషియా పంపుతానని ఓ ఏజెంటు నమ్మబలికాడు. సరేనని సొమ్ము ఇస్తే మలేషియా కాకుండా దుబాయ్‌లో దింపాడు. అక్కడ వీసా ఇబ్బందులతో వారంపాటు నిర్బందించారు. మలేషియా వెళ్లిన తర్వాత అక్కడే అదే నిర్బంధం. చివరకు ఏదోలా బయటపడి తెలిసిన తెలుగు వాళ్ల సాయంతో రోజుకు ఒక చపాతి తిని గడిపాను. ఏజెంట్ పాస్‌పోర్టు తీసేసుకోవడంతో అక్కడ రాత్రి వేళల్లో కంపోజింగ్ పనిలో మూడు నెలలు పనిచేసి కొంత సొమ్ము కూడగట్టుకుని మళ్లీ పాస్‌పోర్టు సంపాదించుకున్నా. ఆరు నెలల తర్వాత గాని ఇంటికి ఫోన్ చేసుకునే అవకాశం రాలేదు. కంప్యూటర్ నాలెడ్జ్ ఉండటంతో ఇప్పుడు మలేషియాలో జాబ్ చేసుకుంటున్నా. సరైన పత్రాలు లేక వందల మంది ఎయిర్‌పోర్టు నేల మాడుగుల చీకటి గదుల్లో ఖైదీలుగా మగ్గుతూనే ఉన్నారు.

దుబాయ్‌లో దుర్భర జీవితం

'దుబాయ్‌లో ఎనిమిదేళ్లగా దుర్భర జీవితం గడుపుతున్నా. షార్జా ఎయిర్‌పోర్టులో పని ఇప్పిస్తానని ఏజెంట్ తీసుకు వెళితే అక్కడ మూడేళ్ల పనిచేశా. అక్కడ ఒక పాకిస్తాన్ యువకుడితో పరిచయం ఏర్పడితే.. అతను పెద్ద ఉద్యోగం ఇప్పిస్తానని పాస్‌పోర్ట్ కాజేశాడు. ఐదేళ్లగా ఓ ప్రైవేటు న్యాయవాది వద్ద పనిచేస్తున్నా. తిండి పెట్టి, ఉండటానికి ఒక గది ఇచ్చాడు. భారతదేశానికి తిరిగి రావాలంటే పాస్‌పోర్టు లేదు. చేతిలో సొమ్ములు లేవు' అని పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన నరేంద్ర అనే యువకుడు ఆంధ్రజ్యోతి ప్రతినిధి వద్ద వాపోయాడు.

గల్ఫ్ దేశాల్లో ఏం బాగాలేదు



'గల్ఫ్ దేశాల్లో కంపెనీల పరిస్థితి ఏమీ బాలేదు. జీతాలు కూడా సరిగా ఇవ్వడం లేదు. ఇచ్చేది రూ.20, రూ.30 వేల మించి రావడం లేదు. పని కూడా ఎక్కువ. నిబంధనలు మరింత కఠినతరం చేశారు. ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు లేదు. అందుకే చాలా మంది యూరప్ దేశాలపై మక్కువ చూపుతున్నారు. అక్కడ నెలకు రూ.70 వేల వరకు వస్తోంది. వాస్తవంగా చూస్తే ఇక్కడ ఉపాధి అవకాశాలు ఇక్కడే బాగున్నాయి. ఎప్పటికప్పుడు స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకుంటే అక్కడికంటే ఇక్కడే ఎక్కువ సంపాదించవచ్చున'ని తణుకుకు చెందిన ట్రావెల్ ఏజెంట్ బీహెచ్ రామకృష్ణ చెబుతున్నారు.

ఓం నమో నారసింహా..



అంతర్వేదిలో వేలాది మంది భక్తులతో సాగుతున్న రథయాత్ర

ఓం నమో నారసింహా.. జై లక్ష్మీ నరసింహా.. అంటూ భక్తుల శరణుఘోష మధ్య అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథం ముందుకు కదిలింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అంతర్వేది తిరునాళ్లకు వెళ్లి రథయాత్రలో పాల్గొన్నారు.

- 6లో..



ద్వారకాతిరుమల శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీ నారసింహస్వామి కల్యాణోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 6లో..

జేఎన్‌వీ ప్రవేశ పరీక్షలకు..

దరఖాస్తు విద్యార్థులు 1,660

గైర్హాజరీలు 1,169 మంది

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)లో 9, 11వ తరగతుల్లోకి అందుబాటులోవున్న సీట్లను భర్తీ చేసేందుకు శనివారం ప్రవేశపరీక్షలు జరిగాయి. ఏలూరు, పెదవేగిల్లోని ఆరు కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 9వ తరగతి ప్రవేశాలకు 1,007 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 302 మంది, 11వ తరగతి ప్రవేశాలకు 653 మంది దరఖాస్తు చేసుకోగా 189 మంది హాజరయ్యారు. మొత్తంమీద ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 1660 మంది విద్యార్థుల్లో కేవలం 491 మంది మాత్రమే హాజరు కాగా, ఏకంగా 1169 మంది గైర్హాజరు కావడానికి ఆయా తరగ తుల్లో సీట్ల ఖాళీలు పెద్దగా ఉండకపోవడమేనని చెప్పవచ్చు. పెదవేగి జేఎస్‌వీలో వచ్చే విద్యాసంవత్సరానికి (2025-26) 9వ తరగతిలో ఏడు సీట్లు అందుబాటులో ఉండగా, సంబంధిత సీట్లను మెరిట్ ప్రకారం రిజర్వేషన్ వర్గాల విద్యార్థులతో మాత్రమే భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇక 11వ తరగతిలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల్లో సహతుక కారణాలపై ఎవరైనా టీసీ తీసుకుంటేనే ఆ మేరకు భర్తీ జరుగుతుంది. ఇలా ఏర్పడే ఖాళీలను సైతం భర్తీ చేయడానికి తొలి ప్రాధాన్యత ట్రిపుల్ ఐటీలో సీటురాని వారికి, కేంద్ర ప్రభుత్వ దక్షిణ భారత టెస్టులో ఉత్తీర్ణులైన వారికే ఉంటుంది. వచ్చే విద్యాసంవత్సరానికి పెదవేగి జేఎస్‌వీలో 11వ తరగతిలో ఇంతవరకు ఒక్కసీటూ ఖాళీలేదు. ఈ కారణాలతో దరఖాస్తు చేసుకున్న వారిలో అత్యధికులు గైర్హాజరవుతుంటారని జిల్లావిద్యా శాఖ వర్గాలు వివరణ ఇచ్చాయి. ఏప్రిల్‌లో ఫలితాలను వెల్లడిస్తారు. పెదవేగి జేఎస్‌వీ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, డీఈవో వెంకటలక్ష్మమ్మ పరీక్ష కేంద్రాలను సందర్శించారు.



శ్రీమతి ఈదర సుబ్బమ్మదేవి నగరపాలకోన్నత పాఠశాలలో విద్యార్థినుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న హెచ్‌ఎం

14 దుకాణాలు.. 287 దరఖాస్తులు

కల్లుగీత మద్యం షాపుల లైసెన్సులకు పోటాపోటీ

ప్రభుత్వానికి రూ.5.74 కోట్ల ఆదాయం

ఏలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్లుగీత కార్మికుల ఉపకులాలకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు పోటెత్తాయి. మొత్తం 14 షాపుల కోసం దరఖాస్తు గడువు శనివారం సాయంత్రంలో ముగిసింది. చివరి రోజున 152 మంది దరఖాస్తు చేసుకోగా మొత్తంగా 287 మంది లైసెన్సు వేటకు సిద్ధం అయ్యారు. దరఖాస్తుల ఫీజుల రూపంలో ఆదాయ అర్జనలో ఏలూరు జిల్లా మూడో స్థానంలో నిలిచింది. అక్టోబరులో 141 షాపులకు దరఖాస్తు ఫీజు కింద ప్రభుత్వానికి రూ.110 కోట్లతోను ఏలూరు మూడో స్థానంలో నిలిచిందని, తాజాగా 287 దరఖాస్తుల నాన్ రిఫండబుల్ ఫీజుగా ప్రభుత్వానికి రూ.5కోట్ల 74 లక్షల రూపాయల ఆదాయం సమకూరిందని ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెం డెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఏలూరు టౌన్ నుంచి 18 , దెందులూరు 3, చింతలపూడి 25, టినరసాపురం 28, నిడమర్రు 10, జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో 33, జంగారెడ్డిగూడెం రూరల్ 27, కొయ్యలగూడెం 32, మండవల్లి 12, నూజివీడు టౌన్ 36, చాట్రాయి 13, ముసునూరు 9, ఆగిరిపల్లిలో 20 దరఖాస్తులు అందాయి. ఈ నెల 9న ఆదివారం దరఖాస్తుల పరిశీలించి 10న డ్రా తీసి షాపులను అభ్యర్థులకు కేటాయించనున్నారు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు నగరంలోని డివిజన్‌లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజలే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లే కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టింది. 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం ద్వారా మంగళవారం ఉదయం 11-12 గంటల మధ్య

70136 20539

నెంబరుకు ఫోన్ చేయండి. నగర పాలక సంస్థ పరిధిలోని డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను ఏలూరు నగర కమిషనర్ భానుప్రతాప్ దృష్టికి తీసుకురండి. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారు.

25 నుంచి 'వందేభారత్'కు ఏలూరులో హాల్ట్

-7లో

దొరకనంటున్న వధువు, ఆగనంటున్న వయస్సు ఇదీ నేటి పెళ్లికాని ప్రసాద్‌ల పరిస్థితి.. సోలోగా జీవితం నెట్టుకురాలేక, సమాజంలో ఇమడలేక సతమతమవుతున్న యువతను తాళి ఎగతాళి చేస్తోంది. నాడు వరకట్నాలు ఇచ్చుకోలేక ఆడపిల్లల తల్లిదండ్రులు సతమతమయ్యేవాళ్లు.. నేడు పరిస్థితులు మారిపోయాయి. ఒకింటివాడయ్యి తమ కుమారుడు ఎప్పుడు పిల్లాపాపలతో ఆనందంగా ఉంటాడా? అని మగపిల్లల తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. కొన్ని సామాజిక వర్గాల్లో ఆడపిల్లలు లేక, మరో సామాజిక వర్గం యువతిని పెళ్లి చేసుకోలేక యువకులు బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. నెత్తిన బట్ట, పెరిగిన పొట్ట చూసి నో చెప్పే ఆడపిల్లలు కొందరైతే సేలరీ కార్డు చూసి ముఖంచాటేసే యువతులు మరికొందరు.. 28 ఏళ్లు దాటినా పెళ్లికి పిల్ల దొరక్క జీవితంలో సరైన ఉద్యోగం లేక ఇక నా జీవితం ఇంతే అని డిప్రెషన్‌లోకి వెళ్లి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

\- నిడమర్రు



పెళ్లి కలేనా?

- నానాటికీ పెరుగుతున్న పెళ్లికాని యువకుల సంఖ్య
- కొన్ని సామాజిక వర్గాల్లో పరిస్థితి మరింత అధ్వానం
- ఎదురుకట్నం ఇస్తామన్నా అందుబాటులో లేని వధువులు
- ఉన్నత చదువులు, ఉద్యోగం, తగ్గిన అమ్మాయిల సంఖ్యే కారణమా!
- 30 ఏళ్లు వచ్చినా పెళ్లికోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూపులు
- వెనుక ఆస్తి ఉన్నా ఆచితూచి అడుగులు వేస్తున్న యువతులు
- వరకట్నం మాట అలా ఉంచితే పిల్ల దొరికితే చాలంటున్న యువకులు



పెరిగిపోతున్న నిరుద్యోగం, ఖర్చులతో ఇమడలేమనే భయం, చాలీచాలని జీతాలతో సంసారమనే సాగరంలో ఈదలేమోననే భయం, కొన్ని సామాజిక వర్గాల్లో తగ్గిపోయిన ఆడపిల్లల సంఖ్య వెరసి పెళ్లికాని ప్రసాద్‌లు పెరిగిపోతున్నారు. ఒకానొకప్పుడు ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే కట్నాల కోసం ఉన్న ఆస్తిని కుదవ పెట్టడమో లేక అమ్మడమో చేసేవాళ్లు తల్లిదండ్రులు. ఇప్పుడు పెళ్లయితే చాలురాబాబూ అనుకునే స్థితికి మగ పిల్లల తల్లిదండ్రులు చేరుకున్నారు. గతంలో ఆడపిల్ల పెళ్లికి కాళ్ల చెప్పులు అరిగేలా తండ్రి తిరగాల్సి వచ్చేది.. ఇప్పుడు ఆడపిల్ల ఉందంటే చాలు మగ పిల్లల తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. ఆడపిల్ల అందచందాలు ఎలా ఉన్నా మంచిదైతే చాలంటూ పెళ్లికి మగపెళ్లి వారు తొందరపెట్టేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని సామాజిక వర్గాల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది.. ఆడపిల్లలు లేకపోవడంతో మరో సామాజిక వర్గం వారిని కోడలిగా తెచ్చుకోవాల్సి వస్తోందంటూ తల్లిదండ్రులు బాహాటంగానే చెబుతున్నారు. కట్నం కోసం డిమాండ్ చేసే రోజులు పోయి పెళ్లిఖర్చులు కూడా మగపెళ్లివారే భరిస్తున్నారు. దీనికి కారణం ప్రతి సామాజిక వర్గంలోనూ పెళ్లికాని ప్రసాద్‌ల సంఖ్య పెరిగిపోవడం, ఆడపిల్లల సంఖ్య తగ్గడమేనని తెలుస్తోంది.



ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఉన్నత విద్య కోసం పెళ్లిని వాయిదా వేస్తున్నారు. ఒక డాక్టర్ వృత్తి చేపట్టిన యువకుడు తన వృత్తి నైపుణ్యాలను పూర్తి చేయాలంటే కనీసం 30

ఉద్యోగ వేటలో ఆలస్యం..

ఏళ్ల వరకు ఆగాలి. ఓ ఇంజనీరు, ఓ లాయర్ ఇలా ఏ కోర్సు చేపట్టినా దానిలో విద్య అనంతరం ఉద్యోగ జీవితంలో స్థిరపడాలంటే 28 ఏళ్ల పూర్తికావాల్సిందే.. ఈ సందర్భంగా లేటుగా పెళ్లిపీటలు ఎక్కాల్సి వస్తోంది. ఉద్యోగం వచ్చే సరికే 28 ఏళ్లు, తన అభిరుచి, వయస్సుకు తగ్గ ఆడపిల్ల దొరకాలంటే మరింత సమయం ఇలా వెరసి పెళ్లి ఆలస్యమవుతోంది.

విదేశీ సంబంధాలపై తగ్గిన మోజు

ఒకప్పుడు మా అల్లుడు అమెరికా, ఆస్ట్రేలియా అంటూ తల్లిదండ్రులు బీరాలుపోయేవారు. కాలక్రమంలో మార్పు వచ్చింది. వరుడైనా, వధువైనా విదేశీ సంబంధాలపై ఆసక్తి చూపడం లేదు. కుటుంబాలు అందుబాటులో ఉంటే చాలని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌ఆర్‌ఐ వరుడికి వయస్సు మీదపడుతోంది.

పెళ్లి విషయంలో రాజీలేని తత్వం

ఒకప్పుడు పెళ్లి విషయంలో వధూవరులు పెద్దలు చెప్పిన మాటకు కట్టుబడి ఉండేవారు. నేటి యువత విద్యాధికులు కావడంతో పెళ్లి విషయంలో రాజీపడటం లేదు. కాస్తోకూస్తో స్థిరపడ్డాకే పెళ్లిమాటెత్తుతున్నారు. దీంతో తల్లిదండ్రులు కూడా మీ ఇష్టం అంటూ పక్కకు తొలగిపోతున్నారు. పెళ్లి విషయంలో వధూవరులు రాజీలేని ధోరణితో పెళ్లిళ్లు ఆలస్యం అవుతున్నాయి. కులవృత్తులు చేసుకుని స్థిరపడిన యువకుల పట్ల యువతులు ఆసక్తి చూపడం లేదు. అల్లుడు పంచె కట్టొద్దని, మట్టిపిసుక్కునే వాళ్లు వద్దని, చెరువులు, వ్యవసాయం చేస్తుంటే నో చెబుతున్నారు. ప్రతి ఆడపిల్ల తండ్రి తమ కూతురు సిటీలో పెరగాలని కలలు కంటున్నారు.

పెళ్లికోసం కళ్లు కాయలు

పెళ్లికావాల్సిన యువకుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ప్రతి ఊరిలోనూ పెళ్లి కాని యువకులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా అగ్రవర్ణాలుగా పిలిచే బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి వంటి సామాజిక వర్గాల్లో పెళ్లికావాల్సిన యువకుల సంఖ్య గణనీయంగా ఉంది. అధిక జనాభా కలిగిన కాపు సామాజిక వర్గంలోనూ ఇదే పరిస్థితి. పల్లెలు, పట్నాలనే తేడా లేకుండా పెళ్లి కోసం ఎదురుచూస్తున్న ప్రసాద్‌ల సంఖ్య పెరుగుతూపోతోంది. కొంతమంది మంచి ఉద్యోగాల్లో స్థిరపడినా శారీరక ఫిట్‌నెస్ లేకపోవడంతో పెళ్లికోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులు కూడా తామే భరిస్తామంటూ పెళ్లికొడుకులు ముందుకొస్తున్నా వధువు దొరకడం లేదు.. కొన్ని చోట్ల పిల్ల దొరికితే ఎదురు కట్నంతో పాటు బంగారు నగలు పెట్టి ఆడపిల్లను కోడలిగా తీసుకెళ్తున్నారు.



పెరుగుతున్న లేట్ మ్యారేజెస్

ఇటీవల జరుగుతున్న పెళ్లిళ్లను పరిశీలిస్తే వయస్సు పైబడిన వరుడే దర్శనమిస్తున్నాడు. చదువు, ఉద్యోగం, తర్వాతే పెళ్లి అనడంతో లేట్ మ్యారేజెస్ సంఖ్య ఎక్కువైంది. వివాహ వయస్సు 21 ఏళ్లు కాగా వాస్తవంగా పెళ్లికుమారుని సగటు వివాహ వయస్సు 30 నుంచి 35 ఏళ్ల వరకు నడుస్తోంది. ఆడపిల్ల వివాహ వయస్సు 28 నుంచి 32 సంవత్సరాల వరకు నడుస్తోంది. దీంతో సంతానం విషయంలో తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒత్తిడి, వయస్సు ప్రభావం కారణంగా సంతాన సాఫల్య కేంద్రాల వైపు పరుగులు తీయాల్సి వస్తోంది.

జాతకాల పాత్ర ఎంతో కీలకం

పెళ్లి సంబంధాల్లో జాతకాల పాత్ర కీలకం. కొన్ని కుటుంబాలైతే జాతకాలపై ఆధారపడతాయి. వధూవరుల జాతకాలు కలుస్తున్నాయా లేదా అనే విషయంపైనే పెళ్లి ఆధారపడి ఉంటుంది. జాతకాల్లో 36 పాయింట్లకు గాను 18 పాయింట్లు ఆపైన కలవాలని, నక్షత్ర గణాలు, జాతక రాశి జంతువులు కలవాలనే ఎన్నో నిబంధనలున్నాయి. మరి కొంతమంది యువకులు ఒక్క సిద్ధాంతి మాత్రమే అనుసరించకుండా ఇద్దరి ముగ్గురు సిద్ధాంతుల వద్ద అభిప్రాయ సేకరణ చేస్తూ పెళ్లి విషయంలో ముందడుగు వేస్తున్నారు.

సిబిల్ స్కోర్ చూసి పెళ్లి క్యాన్సిల్

ఇటీవల కాలంలో వరుడి ఎంపికలో వధువులు కఠిన నిబంధనలు పెడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావాలని, ఆస్తి ఉండాలని, అత్తమామల గోల లేకుండా వేరే కాపురం పెట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బ్యాంకు బాలెన్స్, కార్ ఉండాలంటూ పెళ్లిళ్ల పేరయ్యలకు లిస్టు చెబుతున్నారు. 20 ఎకరాల పొలం ఉన్నా తమ కుమారుడికి పెళ్లి కావడం లేదని ఓ రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. విచిత్రం ఏమిటంటే రైతు కూడా తన కుమార్తెను మరో రైతు ఇంటికి పంపడానికి ఇష్టపడటం లేదు.. విచిత్రంగా మహారాష్ట్రలోని ముర్తిజాపూర్‌లో వరుడి సిబిల్ స్కోర్ చూసి పెళ్లి క్యాన్సిల్ చేసుకున్నారు.

ఐదు వేల పెళ్లిళ్లు చేసిన ఆయన బ్రహ్మచారే..

ద్వారకాతిరుమలలో ఆయన ఒక పెద్ద పురోహితుడు, సిద్ధాంతి, ఆయన చేతిపై పెళ్ళి జరిగితే శుభమని ఎన్నో కుటుంబాలు భావిస్తుంటాయి. తీరా ఆయన పెళ్ళికి వచ్చే సరికే ఎన్నో అడ్డంకులు, ఆటంకాలు ఏర్పడ్డాయి. 30వ ఏట బీఈడీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నం చేసినా ఫలితంలేకపోవడంతో కుల వృత్తి పౌరహిత్యం చేసి కుటుంబానికి అండగా నిలబడ్డాడు. అయితే పెళ్ళి చేసే పంతులుకు తాము పిల్లను ఇవ్వలేమంటూ ఎవ్వరూ ముందుకు రాలేదు. వచ్చిన సంబంధాలు కూడా చేజారిపోయాయి. ఆఖరకు నిరాశతో పెళ్ళిమీద ఆసక్తి తగ్గి బ్రహ్మచారిగానే ఉన్నారు. ఆయన తన చేతితో ఇప్పటికీ కనీసం ఐదు వేల పెళ్ళిళ్ళు చేసి పురోహితుడిగా మిగిలిపోయాడు.

కుటుంబ బాధ్యతల మధ్య నలిగి

తాడేపల్లిగూడెం ప్రభుత్వ కార్యాలయంలో ఒక చిరుద్యోగికి 40 ఏళ్లు.. ఇప్పటికీ ఆయనకు వివాహం జరగలేదు. ఆఫీసుకు వచ్చే పెద్దలను, స్నేహితులను ఏ కులమైన పర్వాలేదు, కట్నం వద్దంటూ రాయబారాలు నడిపిస్తున్నారు. మంచి కుటుంబమైతే చాలు అంటూ తన పెళ్ళికి తానే రాయబారం నడుపుకుంటున్నాడు. చిన్న వయస్సులో వారసత్వంగా వచ్చిన బట్టతల వల్ల కుటుంబ బాధ్యతల వల్ల పెళ్ళి సంబంధాలు అన్ని చెడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఉద్యోగులే కావాలి, రైతు వద్దు..!

భీమవరం పట్టణానికి చెందిన ఒక క్షత్రియ యువకుడు సుమారు 80 ఎకరాల రొయ్యల చెరువులు చేస్తూ దండిగా సంపాదిస్తున్నాడు. పెళ్ళి సంబంధాల విషయానికి వచ్చే సరికి ఆడపెళ్ళి వారు మాత్రం ఉద్యోగం చేసే అల్లుడే కావాలంటూ షరతులు పెట్టడంతో పెళ్ళికి దూరమయ్యాడు. ఏడాదికి 20నుంచి 30 లక్షలు సంపాదించే ఆక్వా రైతు కన్నా నెలకు 50 వేలు తెచ్చుకునే ఉద్యోగికే పిల్లను ఇస్తామంటున్నారు తోటి బంధువులు. దీంతో 43 సంవత్సరాలైనా తెలిసిన వారి ద్వారా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

స్త్రీ, పురుషుల నిష్పత్తి

మన ప్రాంతంలో స్త్రీ పురుషుల నిష్పత్తి 2011 లెక్కల ప్రకారం వెయ్యి మంది పురుషులకు 972 మందే స్త్రీలు ఉన్నారు. ఆ లెక్క ఇప్పుడు మరింత పడిపోయింది. అధికారికంగా జనాభా లెక్కలు లేకపోయినా వెయ్యి మంది పురుషులకు కేవలం 800 లోపే ఉన్నారంటూ అంచనా వేస్తున్నారు.

వివాహ వ్యవస్థ ప్రమాదంలో ఉంది



వివాహాలు ఆలస్యంగా జరగడానికి తల్లిదండ్రులే ప్రధాన కారణం. చదువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వివాహ వయస్సు ఆలస్యమవుతోంది. ఒకప్పుడు పెద్దలు నిశ్చయించిన వివాహానికి పిల్లలు తలవంచి తాళి కట్టించుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సంపాదన వ్యామోహంలో దేహధర్మాన్ని పక్కన పెడుతున్నారు. ఇదే విధానం కొనసాగితే వివాహ వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉంది.

ఆర్.వెంకట సూర్యనారాయణ రాజు, గణపవరం

డబ్బుతో అనుబంధాన్ని కొలవకూడదు



మేము 15ఏళ్ల నుంచి కాపు వధూవరుల పరిచయవేదికతో సుమారు 200 వాట్సప్ గ్రూపుల ద్వారా ఉచిత సేవలందిస్తున్నాం. గతంలో కంటే చాలా మార్పులు వచ్చాయి. వెనుకాల ఆస్తితో పాటు ఉద్యోగం ఉంటేనే పెళ్లికూతురు వైపు నుంచి సంబంధాలొస్తున్నాయి. మాటామాటా పెరిగి కొన్ని చోట్ల కుదిర్చిన సంబంధాలు కూడా ఆగిపోతున్నాయి. వివాహబంధాన్ని డబ్బుతో కొలవ కూడదు. జీవితాంతం కలిసి ఉండే అనుబంధమే..

టి.నాగబాబు, సీసలి(భీమవరం)

వైభవంగా లక్ష్మీ నరసింహుడి రథోత్సవం

స్వామి దర్శనానికి పోటెత్తిన భక్త జనం

విశేషంగా ఏర్పాట్లు చేసిన అధికారులు



రథాన్ని లాగుతున్న భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణలతో అంతర్వేది పురవీధుల్లో శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి రథోత్సవం శనివారం మధ్యాహ్నం 2.49 గంటలకు లక్షలాది మంది భక్త జన సందోహాల మధ్య కనుల పండుగగా ప్రారంభమైంది. తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొని భక్తిపారవశ్యంతో పులకించారు. భక్తజన సందోహం మధ్య అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి రథయాత్ర జరిగింది. తొలుత ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహదూర్ రథానికి తొలిపూజ చేశారు. అనంతరం కొబ్బరికాయ, గుమ్మడికాయలను కొట్టి రథాన్ని ప్రారంభించారు.వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం నుంచి స్వామి - అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రథంపై కొలువు తీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకొచ్చారు. రాజావారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు పట్టింది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జంగమ దేవరులు పూరించిన శంఖాల ధ్వనితో సాగర సంగమ తీర ప్రాంతం మార్మోగింది. రానున్న రోజుల్లో రాష్ట్ర ఉత్సవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగెన నాగేశ్వరరావు వారిచే నిర్మించిన గజ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఇదిలా ఉంటే స్వామివారి రథోత్సవం 59 వసంతాలు పూర్తి చేసుకుంది.



బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీసులు

భక్తులకు అక్షింతల పంపిణీ..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం అనంతరం తలంబ్రాలు బియ్యం కోసం భక్తులు బారులు తీరారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి క్యూలైన్లలోనే ఆలయ సిబ్బంది భక్తులకు తలంబ్రాలు అందజేశారు. ప్రతీ భక్తునికి అక్షింతలు అందేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.

తరలివచ్చిన లక్షా 10వేల మంది

అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వామివారి కల్యాణోత్సవాల అనంతరం భీష్మ ఏకాదశి పర్వదినాన స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో సుమారు లక్షా 10వేల మంది భక్తులు పాల్గొన్నారని ఆర్డీవో కె.మాధవి తెలిపారు. కల్యాణం అనంతరం సాయంత్రం వరకు సుమారు 2లక్షల మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారని అన్నారు.

వరుడైన నారసింహుడు

సుందరగిరిపై ప్రారంభమైన కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన మండలంలోని ఐఎస్. జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనారసింహ స్వామి కల్యాణోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 13 వరకూ జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి అమ్మవార్ల మూర్తులను ఉంచి అర్చకులు పుష్పాలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా నరసన్నను, కనకవల్లీ, లక్ష్మీ అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేశారు. రాత్రి ఆలయంలో అంకు రార్పణ, ధ్వజారోహణ, తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు మూల విరాట్‌ను, కల్యాణమూర్తులను దర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామిని దర్శించుకున్నారు.

కాలినడకన చిన వెంకన్న క్షేత్రానికి...

జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల నుంచి పదివేల మంది పైబడి భక్తులు పాదయాత్రగా శనివారం చినవెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. ఏటా మాఘశుద్ధ ఏకాదశినాడు కాలిన డకన క్షేత్రానికి రావడం భక్తుల ఆనవాయితీ..

నేత్రపర్వంగా శ్రీవారి తిరువీధిసేవ



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తొళక్క వాహనంపై ఉభయ దేవేరులతో కొలువుదీరిన శ్రీవారు శనివారం రాత్రి క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇలా భక్తజనులకు దర్శనభాగ్యాన్ని ఇచ్చారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్కంపై ఉంచి అలంకరించారు. అనంతరం పూజాధికాలు జరిపి హారతులు సమర్పించారు. ఆ తరువాత మేళతాళాలు, డోలుసన్నాయి వాయిద్యాల నడుమ అట్టహాసంగా తిరువీధులకు తీసుకెళ్లారు. ప్రతి ఇంటా భక్తులు దేవతామూర్తులకు హారతులు పట్టారు. ఈ ఉత్సవం ఆద్యంతం భక్తులను కనువిందు చేసింది.

భక్తజన సంద్రమైన చిన వెంకన్న ఆలయం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : భీష్మఏకాదశి పర్వదినాన చిన వెంకన్న క్షేత్రం భక్తజనసంద్రమైంది. స్వామికి ఇష్టమైన రోజు అలాగే రెండవ శనివారం కావడంతో విశేష సంఖ్యలో యాత్రికులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందురోజు రాత్రికే పాదయాత్రగా వందలాది మంది ఆలయానికి చేరుకున్నారు. వీరి రాకతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. దాదాపు 25 వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి. దర్శనానంతరం వారంతా శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



వెంకన్న ఆలయ ఆవరణలో భక్తులు



నాటకాలను వీక్షిస్తున్న భీమవరం పట్టణ వాసులు

ఆకట్టుకున్న హరికథా గానం

భీమవరంటౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : భీమవరంలోని మావుళ్ళమ్మ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కోటి కలపూడి గోవిందరావు కళావేదికపై సాయత్రం 5 గంటలకు రామచంద్రాపురానికి చెందిన ఎం.శిఖామణి హరికథా గానం చేశారు. భక్తి సంబంధిత విషయాలను భక్తులకు తెలియజేశారు. మధ్యాహ్నం 4 గంటలకు ప్రజా పిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయానికి చెందిన రేవతి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రాత్రి 8 గంటలకు సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు.



హరికథా గానం చేస్తున్న శిఖామణి

పట్టిసీమ ఉత్సవాల పనులు ప్రారంభం

పోలవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల పనులను పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫెర్రీ రేవులో కొబ్బకి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం నది ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ళు, బట్టలు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు ఇతర మౌళిక వసతుల పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వరరావు, ఆలయ కార్య నిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, ఉప సర్పంచ్ నునకాని రమ్యలతాదర్మేంద్ర, ఫెర్రీ కాంట్రాక్టర్ బొరుసు రాంబాబు పాల్గొన్నారు.



ఇసుక తిన్నెల్లో పనులు ప్రారంభిస్తున్న అధికారులు

12,13న బధిరుల క్రికెట్ పోటీలు

భీమవరంటౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : భీమవరంలో ఈనెల 12,13 తేదీల్లో వెస్ట్ గోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరే షన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 5వ రాష్ట్రస్థాయి మూగ చెవుడు(బధిరులు) టీ- 20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నారు. శనివారం భీమవరం వెంకట్రామ థియేటర్ వద్ద పోటీల బ్రోచర్, బ్యానర్‌ను అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ భీమవరం గన్నాబత్తుల క్రీడ మైదానంలో రెండు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 10 టీమ్‌లు పాల్గొంటున్నాయని తెలిపారు. డీఎన్నార్ కళాశాల యాజమాన్యం పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నిట్‌లో ముగిసిన ఉల్కాన్‌జీ వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడితే ఎన్నో అద్భుతాలు సాధించవచ్చునని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణరావు అన్నారు. నిట్‌లో జరుగుతున్న ఉల్కాన్ జీ కల్చరల్ ఫెస్ట్ 2కె25 కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలైనా, పాటలైనా, కళలైనా మనసు పెట్టి నిరంతర సాధన చేస్తే లక్ష్యాలను చేరుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ కే.హిమబిందు, డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్, అసోసియేటన్ డీన్ తలారి రేష్మ, ఆచార్యులు రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

12న చిన్న పిల్లల గుండె వ్యాధుల వైద్య శిబిరం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కంజెనిటల్ హార్ట్ డిసీజ్ వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 12న ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని డీఈఐసీ రూమ్ నెంబరు 78లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో 2డి ఏకో, పీడియాట్రిక్ కార్డియాలజీ కన్సల్టేషన్ సేవలను కార్డియాలజిస్టులు డాక్టర్ ఆర్.జ్యోతిప్రకాష్, డాక్టర్ వి.వాసుదేవ్, డాక్టర్ కె.అనూష అందిస్తారని వివరించారు. వివరాలకు ఆస్పత్రి ఫోన్‌నెంబర్లు 95421 74567, 94903 36364లలో సంప్రదించాలని కోరారు.

జగన్ అత్యంత ధనవంతుడు

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రాజకీయ నాయకుల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అత్యంత ధనవంతుడని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. శనివారం ఏలూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత సంపాదన ఎలా వచ్చిందో ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వకముందు వారికి ఆస్తులు పెద్దగా లేవని, రాజశేఖర్‌రెడ్డి సీఎం అయిన ఐదేళ్లలో జగన్ విపరీతంగా అవినీతి సొమ్ము సంపాదించాడన్నారు. తండ్రి మరణానంతరం జగన్ సానుభూతితో ముఖ్యమంత్రి పదవి అధిరోహించి, ఐదేళ్ల కాలంలో సంపాదనకు అడ్డేలేకుండా పోయిందన్నారు. మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎట్టిపరిస్థితిల్లో లేవని, పరిపాలన చేతకాక ప్రజల్లో ఉన్న సానుభూతిని పోగొట్టుకున్నాడన్నారు. వైఎస్ మరణాన్ని సోనియాగాంధీ, ముఖేష్ అంబానీలపై నెట్టేశారన్నారు. జగన్ చెల్లెలు షర్మిల మా అన్న అన్నీ అబద్దాలు చెబుతాడని, అబద్ధాలంటే మా అన్నకు బాగా ఇష్టమని చెప్పడంతో జగన్ ఎలాంటి వాడో అర్థమవుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టులో జగన్ అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు పోలవరంలో జరిగిన అవినీతిపై విచారణకు ఆదేశించాలన్నారు.

రేపు ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ నామినేషన్

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌డీయే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఈ నెల 10వ తేదీన ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేయనున్నారని ఏపీఐఐసీ ఛైర్మన్, పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఏలూరు నగరంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద నుంచి 10వ తేదీ ఉదయం 10 గంటలకు బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారని ఈ కార్యక్రమంలో ఎన్‌డీయే కూటమి నాయకులు పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరారు.

విర్డ్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ ఆంకాలజీ సర్జన్ సేవలు



ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ రాజీవ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న సుధాకరరావు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ప్రముఖ ఎముకల క్యాన్సర్ స్పెషలిస్ట్ (ఆర్థోపెడిక్ ఆంకాలజీ సర్జన్) డా. రాజీవ్‌రెడ్డి శనివారం వైద్యసేవలందించారు. ఈక్రమంలో ఆయన ఆసుపత్రిలో ముగ్గురు రోగులను పరీక్షించి అందులో ఒకరికి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇకపై డా. రాజీవ్‌రెడ్డి సేవలు విర్డ్ ఆసపత్రిలో అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి ట్రస్ట్ ఛైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఐవీఆర్ సుధాకర్రావు, వి.నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు

పారిజాతగిరి స్వామికి ప్రత్యేక పూజలు

ఏలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు జాయింట్ రిజిస్ట్రార్ ఎస్.వెంకట శ్రీ రామ మూర్తి, లలితా కుమారి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో మానికల రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందచేసి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలతో ఘనంగా సన్మానించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బియ్యం భారం!

» మిల్లుల్లో పేరుకుపోతున్న నిల్వలు » నాణ్యత దెబ్బతింటుందని మిల్లర్ల ఆందోళన

» ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వాలంటున్న సివిల్ సప్లయిస్ » గోదాముల కొరతతో రవాణా బంద్



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

బియ్యం సేకరణలో రైస్ మిల్లర్లు ఇబ్బం దులు పడుతున్నారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లో గోదాముల కొరత వెంటాడు తోంది. మిల్లర్లు బియ్యం అప్పగిద్దామన్నా ఫలితం లేకుండా పోతోంది. మరాడించిన బి య్యం రాశులుగా మిల్లులో ఉంటున్నాయి. ఫలితంగా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. బియ్యం సేకరణ సవ్యంగా జరిగితే ఎప్పటికప్పుడు ప్యాకింగ్ చేసి అప్పగిస్తుంటారు. మిల్లర్లకు ఎటువంటి సమస్య ఉండదు. బియ్యం దెబ్బతింటాయన్న గుబులు ఉండదు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో బియ్యం సేకరణ కూడా పౌర సరఫరాల కార్పొరేషన్‌దే. ఖరీఫ్‌లో ఉత్పత్తి అయ్యే బియ్యాన్ని పౌరసరఫరాల కార్పొరేషన్ భద్ర పరుస్తుంది. రబీలో ఉత్పత్తి అయ్యే బి య్యాన్ని ఎఫ్‌సీఐకి ఇచ్చేలా కార్పొరేషన్ దిశా నిర్దేశం చేస్తుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పరిస్థితులు తారుమారు అయ్యాయి. రైతులకు 24 గంటల వ్యవధిలోనే సొమ్ములు జమ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిధులు పూర్తి గా దారిమళ్లించడంతో ఇప్పుడు ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. అయినా కూటమి ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యం ఇస్తోంది. సకాలంలో సొమ్ములు చెల్లిస్తోంది. అందుకోసం సొమ్ము లకు ఇబ్బంది లేకుండా ఖరీఫ్ బియ్యాన్ని కూడా కేంద్రం ఆధీనంలో ఉన్న ఎఫ్‌సీఐకి ఇ వ్వాలని ప్రభుత్వం భావించింది. దానిని పౌరసరఫరాల కార్పొరేషన్ ఆచరణలో పెట్టింది. ఇప్పటిదాకా ఎఫ్‌సీఐకి దాదాపు 55వేల టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించారు. మరో 1.55 లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ తీసుకుంది. ఖరీఫ్‌లో ఉత్పత్తి అయిన మిగిలిన బియ్యాన్ని అప్పగించడానికి ఇప్పుడు మిల్లర్లు ఆపసోపాలు పడుతున్నారు.

సామర్థ్యం తగ్గించిన ఎఫ్‌సీఐ

భారత ఆహార సంస్థ వద్ద గతంలో 5 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించిన తర్వాత ఎఫ్‌సీఐ తన నిల్వ సామర్థ్యాన్ని తగ్గించుకుంది. ప్రస్తుతం 2.50 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు మాత్రమే ఉన్నాయి. అవన్నీ భర్తీ అయి పోయాయి. ఇతర రాష్ట్రాలకు తరలిస్తేనే మళ్లీ జిల్లాలో సేకరణకు అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసినా సరే రాష్ట్ర రేషన్, ఇతర పౌర అవసరాలకు సరిపడా బియ్యాన్ని మాత్రమే తీసుకుంటుంది. వాటిని రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ భద్ర పరుస్తుంది. మిగులు బియ్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా ఎఫ్‌సీఐకి అప్పగిస్తుంది. ఈ సారి ధాన్యం సొమ్ములు ఇవ్వడానికి ఖరీఫ్‌లోనే ఎఫ్‌సీఐకి ఇవ్వాలని నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగా ఎఫ్‌సీఐ వద్ద గోదాములు లేవు.

ముందుకురాని పౌరసరఫరాల కార్పొరేషన్

వాస్తవానికి రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ వద్ద బియ్యం నిల్వ సామర్థ్యం ఉంది. గోదా ములు ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి సొమ్ములు అవసరం కానున్నాయి. రైతులకు రికార్డు స్థాయిలో ఈ సారి ధాన్యం సొమ్ములు జమ చేశారు. ఖరీఫ్‌లో 4.25 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందుకు సంబంధించి రైతుల ఖాతాలో దాదాపు రూ.960.00 కోట్లు జమ చేసింది. రైతులకు బకాయిలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంది. అందుకోసం ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అప్పగిస్తు న్నారు. ఇప్పటిదాకా 55 వేల టన్నులు అప్పగి ంచారు. ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యానికి మిల్లర్లు మొత్తంపైన 2.85 లక్షల టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంటుంది. పౌరసరఫరాల కార్పొ రేషన్‌కు, ఎఫ్‌సీఐకి 2.10 లక్షల టన్నుల బియ్యం అప్పగించారు. మరో 75వేల టన్నుల బియ్యం పైనే ఇప్పుడు సమస్య ఏర్ప డింది. ఎఫ్‌సీఐకి 20వేల టన్నుల బియ్యాన్ని ఇవ్వాలంటూ పౌరస రఫరాల కార్పొరేషన్ దిశానిర్దేశం చేసింది. ఎఫ్‌సీ ఐ కూడా అందుకు అంగీకారం తెలిపింది. మిగి లిన 55 వేల టన్నులు పౌరసరఫరాల కార్పొ రేషన్ తీసుకోనుంది. ముందుగా ఎఫ్‌సీఐకి ఇవ్వాలని మెలిక పెట్టారు. అక్కడ గోదాములు లేవు. పౌర సరఫరాల కార్పొరేషన్ వద్ద నిల్వ సామర్థ్యం ఉన్నా సరే తీసుకోవడం లేదు. ఎఫ్‌సీ ఐకి అప్పగి ంచాల్సిన లక్ష్యాన్ని పెంచాల్సి వస్తే ఇబ్బంది పడతామన్న ఉద్దేశంతో పౌరసరఫరాల కార్పొ రేషన్ అధికారులు ఆచితూచి అడుగు వేస్తు న్నారు. మిల్లర్ల ఉద్దేశం మరోలా ఉంది. నిల్వ ఉన్న మేరకు పౌరసరఫరాల కార్పొరేషన్ బియ్యాన్ని తీసుకుంటే మిల్లుల్లో నిల్వ కష్టాల నుంచి అధిగమించ వచ్చని భావిస్తున్నారు. తర్వాత ఎఫ్‌సీఐకి ఇచ్చినట్టయితే తక్షణ సమ స్య నుంచి గట్టెక్కే అవకాశం ఉందని తల పోస్తున్నారు. మరోవైపు ఎఫ్‌సీఐ ఇతర రాష్ట్రా లకు బియ్యాన్ని తరలించే చర్యలు చేపట్టింది. అవన్నీ పూర్తయ్యే టప్పటికీ సమయం పట్టను ంది. అంతలోగా కొంతమేర బియ్యాన్ని అయినా పౌరసరఫరాల కార్పొరేషన్ కోవాలన్న భావనతో మిల్లర్లు ప్రయత్నిస్తున్నారు. ఇవేమీ ఫలించడం లేదు.

ఏసీ బోగీల్లో పనిచేస్తూ చోరీలు

» సాహసించి పట్టుకున్న ప్రయాణికుడు » వెలుగు చూసిన మరిన్ని దొంగతనాలు



రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

నరసాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏసీ బోగీలో బెడ్ రోలర్‌గా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తూ ప్రయాణికులు నిద్రలో ఉన్న సమయంలో విలువైన వస్తువులను కొట్టేయడమే ఈ కేటుగాడి పని. తాజాగా శుక్రవారం లింగంపల్లి నుంచి నరసాపురం వస్తున్న షహనాజ్ బేగం ఫోన్ కొట్టేస్తూ అడ్డంగా చిక్కాడు. దీంతో ఈ కేటుగాడు వివేక్ దొంగతనాలు విని రైల్వే పోలీసులు సైతం నివ్వెరపోయారు. రైల్వే పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురం పట్టణానికి చెందిన నాగూర్ వలి తన భార్య షహనాజ్ బేగం, ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి శుక్రవారం రాత్రి లింగంపల్లి నుంచి నరసాపురం ఎక్స్‌ప్రెస్ రైలులో సెకండ్ క్లాస్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్నారు. బేగం కింది బెర్త్‌లో ఫోన్ ఛార్జింగ్ పెట్టి నిద్ర పోయింది. ఆమె గాఢ నిద్రలో ఉన్న విషయాన్ని గుర్తించిన కేటుగాడు ఆమె ఫోన్‌ను కొట్టేశాడు. ఆ సమయంలో ఆమె మేల్కొని కేకలు వేసింది. అయితే నిందితుడు దొంగలించి ఏసీ బోగీలో పరుగులు తీశాడు. బాధితురాలు అతని వెనుకే పరుగు తీస్తూ పట్టుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ప్రయాణికులు లేచినా ఎవరూ దొంగను పట్టేకునేందుకు సాహసించలేదు. కేకలు విన్న భర్త నాగూర్ వలి లేచి చూసే సరికి కింద బెర్త్‌లో భార్య లేదు. వెంటనే పరుగులు తీసి దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే తప్పించుకుని ఏసీ బోగీల్లో దుప్పట్లు భద్రపర్చుకునే కేబిన్‌లో దాక్కున్నాడు. వలి మిగిలిన సిబ్బందిని నిలదీయడంతో వారు దొంగను పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు బోగీ వెతుక్కుంటూ వచ్చారు. నాగూర్ వలీ జరిగిన విషయాన్ని వాళ్ళకు వివరించి గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడ్ని పట్టుకుని పోలీసులు విచారించగా 15కు పైగా సెల్‌ఫోన్లు చిక్కాయి. గతంలో ఇదే రైల్లో పలు ప్రయాణికుల వస్తువులు చోరీలకు గురయ్యాయి. అందులో విలువైన వస్తువులతో పాటు ల్యాప్‌టాప్‌లు కూడా ఉన్నాయి.

క్రైమ్ కార్నర్

అదనపు కట్నం కోసం వేధింపులు

పెదవేగి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నంకోసం వేధిస్తున్నారని పెదవేగి మండలం తాళ్ళగోకవరం గ్రామానికి చెందిన ఎండీ.నసీమా పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం తాళ్ళగోకవరం గ్రామానికి చెందిన ఎండీ.ఖాదర్‌వలితో నసీమాకు రెండేళ్ళ క్రితం వివాహం కాగా, ఇటీవల పాపకు జన్మనిచ్చిన తనను అత్తింటికి తీసుకెళ్ళకుండా అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారని నసీమా ఫిర్యాదు చేసిందన్నారు. నసీమా భర్త ఖాదర్‌వలి, అత్త, మరిది, తోడికోడలు కలిసి అదనపు కట్నంకోసం శారీరకంగా, మానసికంగా వేధించారని, దీనిపై విచారణ జరిపి, తనకు న్యాయం చేయాలని ఇచ్చిన ఫిర్యాదుపై కేసునమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చాడు... నగదు దోచాడు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం మిషన్ వద్దకు వెళ్ళిన ఒక యువతి ఏటీఎం కార్డును మార్చి రూ.25 వేల నగదు డ్రా చేసినట్లుగా ఫిర్యాదు అందడంతో ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన షేక్ గౌసియా గత 27వ తేదీ సాయంత్రం ఏలూరు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఉన్న ఏటీఎం మిషన్ వద్దకు వెళ్ళారు. ఆమె పది వేల రూపాయలు డ్రా చేసుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఒక వ్యక్తి ఏటీఎం కార్డు కిందపడవేసి అది మీదేనని చెప్పి ఆమె కిందకార్డును తీసుకునేలోపు మిషన్‌లో ఉన్న ఆమె కార్డు తీసేసుకున్నారు. ఆమె గమనించలేకపోయారు. వెళ్ళిన అర్థగంట వ్యవధిలో మూడు దఫాలుగా 25 వేల రూపాయల నగదు ఆమె అకౌంట్ నుంచి ఏటీఎం ద్వారా డ్రా చేసినట్లు మెస్సేజ్‌లు వచ్చాయి. దీంతో బాధితురాలు శనివారం సాయంత్రం ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ వివాదం: ఇరువర్గాలపై కేసు

తణుకు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ వివాదంలో రెండు కేసులను నమోదు చేసినట్లు తణుకు రూరల్ ఎస్‌ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం రాత్రి తణుకు పైడిపర్రు ప్రాంతంలో నివాసం వుండే మోపిదేవి శివకు చెందిన ఫ్లెక్సీని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా శివ ఇంటి వెనుక భాగంలో ఉంచగా శుక్రవారం రాత్రి పైడిపర్రుకు చెందిన యర్రంశెట్టి మణికంఠ, సాయిలు తీసుకెళ్లి పోతుండగా మాటా మాటా పెరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. రెండు వైపులా శనివారం కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెంటపాడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం ప్రత్తిపాడు లో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొండ్రుపోలు గ్రామానికి చెందిన జొన్నాల అన్నవరపు సత్యనారాయణ తన భార్య లక్ష్మి (55) ఇద్దరూ కలసి దువ్వలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్ళారు. తిరిగి వచ్చే సమయంలో ప్రత్తిపాడు జాతీయ రహదారి జంక్షన్ సమీపంలో వీరు వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సత్యనారాయణకు ఏమీ కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించామని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ఆటోలో బ్యాగ్ మర్చిపోయిన ప్రయాణికుడు

బ్యాగ్‌ను అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద ఆటో ఎక్కి బస్టాండ్‌కు వెళ్ళి బస్సు వెళ్ళిపోతుందనే కంగారులో ఆయన బస్సు ఎక్కివేశారు. ఆయన ఆటోలో బ్యాగ్‌ను మర్చిపోయారు. దీంతో ఆయన బ్యాగ్ సంగతి గుర్తుకు వచ్చి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నాగకల్యాణి, హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ వారి సిబ్బంది కలిసి వెంటనే ఆటో కోసం గాలింపు చేపట్టారు. నగరంలోని సీసీ పుటేజీల ఆధారంగా ఆటోలను గుర్తించారు. ఆటో డ్రైవర్ వద్ద నుంచి బ్యాగ్‌ను తీసుకువచ్చి తిరిగి ఏలూరులోని ఆర్ఎంఎస్ కాలనీకి చెందిన డాక్టర్ గౌరీపతికి అందించారు. ఆ బ్యాగ్‌లో కొంత నగదు, వెండి వస్తువులు ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో టూటౌన్ పోలీసులకు డాక్టర్ గౌరీపతి కృతజ్ఞతలు చెప్పారు.

రామకృష్ణాపురంలో చోరీ



క్లూస్‌ను సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రామకృష్ణాపురం రామాలయం సమీపంలో చింతా ఉమామహేశ్వరి తన కుటుంబంతో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం ఊరు వెళ్ళి శనివారం మధ్యాహ్నం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్ళి చూడగా బీరువాలో ఉంచిన రెండు లక్షల రూపాయల నగదు, ఆరు కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లుగా గుర్తించి త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తునితో దురుసు ప్రవర్తన

షాపు యజమానికి జరిమానా

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కొండపైనున్న దేవస్థానం షాపులో కొనుగోలు చేసేందుకు వచ్చిన భక్తుని పట్ల దురుసుగా ప్రవర్తించిన షాపుయజమానికి ఆలయ అధికారులు రూ.5వేలు జరిమానా విధించారు. శ్రీవారి దర్శనానంతరం దేవస్థానం పాట షాపులో గాజులు కొనుగోలుకు వెళ్లిన దెందులూరు మండలం కొవ్వలికి చెందిన గండికోట మోహన్ పట్ల షాపు యజమాని దురుసుగా ప్రవర్తించాడు. రూ.280లు చెప్పిన గాజులను రూ.250కు ఇవ్వమన్నాడు. దీంతో షాపు యజమాని భక్తుని చేతిలో ఉన్న డబ్బులు లాక్కున్నాడు. బేరాలు అడగకూడదా అన్నందుకు షాపులోని వారంతా అతని పట్ల దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడారు. దీంతో భక్తుడు ఆలయ ఏఈఓ లక్ష్మణ స్వామికి ఫిర్యాదు చేయగా ఆయన విచారించి వ్యాపారికి రూ.5వేలు జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించారు.



కలాం విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కలాం సేవలు ఎనలేనివి: సీబీఐ మాజీ జేడీ

ఏలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశానికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలు ఎనలేనివని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి లక్ష్మీనారాయణ శనివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఫౌండర్ ఎర్రా అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

25 నుంచి 'వందేభారత్'కు ఏలూరులో హాల్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌలభ్యం కోసం సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 25వ తేదీ నుంచి ఏలూరులో హాల్ట్ కల్పించినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందేభారత్(20707) ఉదయం 9.49 గంటలకు ఏలూరు చేరుకుంటుంది. ఈ నెల 26 నుంచి విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్(20708) రైలు సాయంత్రం 5.44 గంటలకు ఏలూరులో ఆగుతుంది. ఏలూరు స్టేషన్‌లో వందే భారత్ రైళ్లు నిమిషం పాటు ఆగుతాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.

వచ్చే నెల 15 నుంచి జాతీయ నాటిక పోటీలు



నాటికల పోటీల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న పాలకొల్లు కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో 16వ జాతీయ నాటికల పోటీలను మార్చి 15, 16, 17, తేదీలలో నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. పరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణ వర్మ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసచౌదరి, ఉపాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మలకు తొలి పత్రికలను అందించారు.ఈసందర్భంగా కృష్ణ వర్మ మాట్లాడుతూ కళలకు నిలయమైన పాలకొల్లులో నాటిక పరిషత్ ద్వారా జాతీయ స్థాయిలో నాటికల పోటీలను నిర్వహస్తు ఈఏడాది 16వ సంవత్సరానికి చేరుకోవడం జరిగిందని, అందకు సహకరిస్తున్న కళాకారులు, కళాపోషకుల సహకారం మరువలేనిదన్నారు. ఈఏడాది స్థానిక (బస్టాండ్ రోడ్డు) అడబాల థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు జక్కంపూడి కుమార్, కోణిజేటి గుప్త, షేక్ పీర్ సాహెబ్, నడపన శ్రీనివాస్, జీఎస్ఎన్ రవి కుమార్, రెడ్డి వాసు, సోమంచి శ్రీనివాస శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. అమెరికానా ?

(ఐదో పేజీ తరువాయి)

అనుకరించేవారు. అయితే వీరి ఆశలను ఏజెంట్లు, దళారులు సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టారు. అక్కడ ఉద్యోగాలు ఇప్పిస్తామని పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడి, విజిటింగ్ వీసాలపై పంపించేవారు. అక్కడకు వెళ్లిన వారు ఉపాధి లేక, లక్షలు పోగొట్టుకుని ఇక్కడకు రాలేక చాలామంది జైళ్లలో బందీలుగా మిగిలిన సందర్భాలు ఉన్నాయి. ఉపాధికి వెళ్లి మృత్యువాత పడుతున్న వారి సంఖ్య తక్కువేమీ లేదు. మరోవైపు అక్కడ ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. పనులు చేసేవారి సంఖ్య పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వల్ల జీతాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఈ కారణాల రీత్యా లక్షలు ఖర్చు పెట్టుకుని, కుటుంబాలను వదిలి గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇబ్బందులు పడడంకంటే ఇక్కడే ఏదొక పని చేసుకోవడం బెటర్ అనే ఆలోచనలో చాలా మంది ఉన్నారు. దీనితో ఈ మధ్య కాలంలో గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య మునుపటిలా లేదు. బాగా తగ్గిపోయింది.

అక్రమంగా వెళ్లారో ఇరుక్కున్నట్టే..!

గల్ఫ్‌తోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలకు ఉపాధి నిమిత్తం అక్రమంగా వెళితే ఇరుక్కున్నట్టే. దళారులను నమ్మి తగిన పత్రాలు లేకుండా సరిహద్దులు దాటితే.. చిక్కుకుపోతాం. 2022 అక్టోబరు నుంచి 2023 సెప్టెంబరు మధ్య తగిన పత్రాలు లేకుండా యూఎస్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన 96,917 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు అక్కడి కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. 2020లో ఎనిమిది వేల మంది 2021లో పది వేల మంది, 2022లో 12 వేల మంది అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపించింది.

సంపద సృష్టించడం చంద్రబాబుకే సాధ్యం : బడేటి చంటి



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే సత్తా సీఎం చంద్రబాబు ఒక్కరికే ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ రూ.లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చారన్నారు. పారిశ్రామిక వేత్తలంతా రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారు. దావోస్ పెట్టుబడులన్నీ వచ్చి రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించినప్పుడు సంపద పెరగటమే కాకుండా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాన్ని ఖాళీ చేసిందని మండిపడ్డారు. చోడే వెంకటరత్నం, సీహెచ్‌వీ సత్యవరప్రసాద్, బెల్లంకొండ కిషోర్, పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

బలివే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం : చింతమనేని



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన బలివే రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ముసునూరు మండలం బలివేలో ఆలయానికి మహాశివరాత్రికి వేలాదిగా భక్తులు దర్శించుకుని, తమ్మిలేరులో పిండప్రదానం చేసి, పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ఈ మేరకు స్నానాల ఘాట్లను నిర్మిస్తున్నామని, జల్లు స్నానాలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు అల్పాహారంతోపాటు పిల్లలకు పాలు కూడా సరఫరా చేస్తామన్నారు. కూటమి నాయకులు బొప్పన సుధాకర్, పెదర్ల నాని, దారిబోయిన సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, బిర్లంగి పెద్దులు, రావిపాటి పిచ్చియ్య, ఈడ్పుగంటి గిరి, జనసేన నాయకుడు కె.కృష్ణ పాల్గొన్నారు.

• ఏలూరురూరల్ : పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ప్రశంసనీయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు ప్రారంభించి 27 నెలలు పూర్తయిన సందర్భంగా శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ బి.శ్రీకృష్ణ మాట్లాడుతూ తన తండ్రి స్ఫూర్తితో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూక్యానాయక్ పలువురు ఆసుపత్రి వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

11,12 తేదీల్లో మన్యం బంద్ జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ షెడ్యూల్డ్ ప్రాంతంలోని 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 11,12 తేదీల్లో జరిగే రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజా, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం బుట్టాయగూడెంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన నాయకులు తెల్లం రామకృష్ణ, బన్నె వినోద్‌కుమార్, తెల్లం దుర్గారావు, వెట్టి వీరయ్య మాట్లాడారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంద్‌కు ఏజెన్సీలో ఉన్న వర్తక, వాణిజ్య వ్యాపార సంఘాలు సహకరించాలని కోరారు. నాయకులు మడకం పోచమ్మ, పూనెం శ్రీను, శేఖర్, నాగమణి, భీమరాజు పాల్గొన్నారు.

'అమెరికా వాళ్లు భారతదేశం వచ్చేలా తయారు కావాలి'

జంగారెడ్డిగూడెం,ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశ విద్యార్థులను వెనక్కి పంపడం కాదు కొద్ది రోజుల్లో ఇండియాకి రావడానికి అమెరికా వాళ్ళు క్యూ కట్టేవిధంగా తయారుకావాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం స్థానిక తపస్ విద్యాసంస్థల ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి నవభారతాన్ని నిర్మించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యాసంస్థల చైర్మన్ దాకారపు కృష్ణ, వైస్ చైర్మన్ పొరేపల్లి నరేష్, కరస్పాండెంట్ బుద్దాల గోపాలకృష పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న సీఆర్ఆర్ చిన్నారుల ప్రదర్శనలు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు గ్రేడ్ 1, 2, 3 తరగతుల వార్షికోత్సవం శనివారం జరిగింది. వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ ఇండియా-2024 చాంపియన్ ఎ.కోమల్‌కార్తీక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వికసితభారత్ లఘునాటిక, గీతాలాపన అలరించాయి. పలు పోటీల్లో ప్రతిభకనబరిచిన బాలలకు బహుమతులు అందించారు. విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి బాబు, పాలకవర్గ సభ్యులు చంద్రభగవాన్, కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ కేసుల నుంచి విముక్తి నిర్ణయంపై హర్షం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అధికారులపై పెట్టిన విజిలెన్స్ కేసుల నుంచి విముక్తి చేయాలని కూటమిప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సహేతుకమైనదని, దీన్ని స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2014-19 ఏడాదిలో నీరు-చెట్టు పథకంలో పని చేసిన ఇంజినీర్లను గత ప్రభుత్వం కక్షసాధింపుతో విజిలెన్స్ కేసులు నమోదు చేసిందని, ఆ కేసులనుంచి కూటమి ప్రభుత్వం విముక్తి చేస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నీరు-చెట్టు పథకం వల్ల కొన్ని 100 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉమ్మడి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అభివృద్ధికి నోచుకున్నాయని, స్లూయిస్ నిర్మాణం, చెరువు గట్టుల పటిష్ఠం అయ్యాయన్నారు. తుఫాన్లు, వరదలు వచ్చినా ఒక్క చెరువు కూడా గండ్లుప డకుండా రైతులకు సాగునీరు అందించిన గొప్ప పథకం నీరు-చెట్టు నిలుస్తుందన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలానికి చెందిన ఓ యువతి కనిపించడం లేదని పేర్కొంటూ యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. అదే గ్రామానికి చెందిన మేడికొండ కిరణ్ అనే వ్యక్తి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మాయమాటలు చెప్పి, నమ్మించి తీసుకు వెళ్ళినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి

లింగపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో ముందుండాలని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని చలసాని రత్నాకర్ అన్నారు. లింగపాలెంలోని శ్రీవిద్యా హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి చేరాలంటే చదువొక్కటే మార్గమన్నారు. కరస్పాండెంట్ సీహెచ్ సాయిసునంద, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోచేస్తున్నారు..

» రైల్వే స్టేషన్‌లో ఆటోవాలాల ఇష్టారాజ్యం
» ప్రయాణికుల నుంచి అధిక చార్జీల వసూలు
» కానరాని చార్జీల ధరల బోర్డులు.. పట్టించుకోని అధికారులు





పెద్ద రైల్వే స్టేషన్‌లో పడమర వైపు ఉన్న బుకింగ్ కౌంటర్ మార్గానికి అడ్డుగా పెట్టిన ఆటోల దృశ్యాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో నిత్యం 120 రైళ్లకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్నో రైళ్ళు ఈ స్టేషన్‌లో ఆగి వెళ్తా ఉంటాయి. రోజుకు ఐదువేల మంది ప్రయాణికుల వరకు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఉంటారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం వైపు ఉన్న రైల్వే స్టేషన్ మార్గం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రయాణికుల సౌకర్యార్థం గూడ్స్‌షెడ్ రోడ్డు వైపు మరో రిజర్వేషన్ కౌంటర్, రైలు పట్టాలు దాటడానికి బ్రిడ్జి ఏర్పాటు చేసి వెస్ట్ క్యాబిన్ భవనం కట్టారు. కానీ అక్కడ ఆటోలు అనధికారికంగా ఆటో స్టాండ్‌ను ఉన్నకొద్దిపాటి స్థలంలోనే ఆ క్యాబిన్ ముందు స్థలాన్ని ఆక్రమించేసి ప్రయాణికులు కూడా తమ సూట్‌కేసులతో, లగేజీలతో బయటకు వెళ్లేందుకు వీలులేకుండా ఆక్రమించేశారు. అడిగే నాథుడే లేకపోవడంతో ఇష్టారాజ్యం అయిపోయింది. ఎవరైనా అడిగితే రైల్వే అధికారులు తమకు ఇచ్చిన స్టాండ్ అంటూ గొడవపడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కనీసం ర్యాంపు పైనుంచి దిగేదారికి అడ్డుగానే ఆటోలు పెట్టేస్తున్నారు. మరోవైపు అల్లూరి సీతారామరాజు స్టేడియం వైపు నుంచి వెళ్లే మార్గంలో పెద్ద రైల్వే స్టేషన్‌వైపు ఉన్న ఆటో స్టాండ్‌లో కొంతమంది ఆటో డ్రైవర్లు ప్రయాణికులను నిలువునా దోచేస్తున్నారు. గతంలో స్టాండ్‌లో మే ఐ హెల్ప్‌యు అనే పోలీస్ హెల్ప్‌డెస్క్ ఉండేది. ఒక హోంగార్డు కాని, కానిస్టేబుల్ కాని విధులను నిర్వర్తించేవారు. ఆటో ఎక్కే ప్రయాణికులు ఎక్కడికి వెళ్తున్నారో, ఏ నంబర్ ఆటోలో వెళ్తున్నారో, ఎంత కిరాయికి వెళ్లాలో తెలియజేసేవారు. అక్కడ ఛార్జీల ధరల పట్టిక స్పష్టంగా బోర్డు ఉండేది. కానీ నేడు ఇవన్నీ తొలగించేశారు. సీరియల్ పేరుతో ఆటోవాలాలు ఇష్టానుసారంగా ప్రయాణికులను దోచేస్తున్నారు. బయట నుంచి ఆటోలు కూడా లోపలకు రానీయడం లేదు. దివ్యాంగులు, నడవలేని వారు అనారోగ్యంతో ఉన్నవారు, లగేజీలతో ఉన్న వారు రైలు దిగి తమ ఇళ్ళకు చేరాలి అంటూ ఇక్కడ ఆటోవాలాలు చెప్పిన ఛార్జీ చెల్లించుకోవాల్సిందే. లేదంటే ఆ లగేజీలను పట్టుకు మెయిన్ రోడ్డు వరకు రావాల్సిందే. ఇక రాత్రి వేళ అయితే వారు చెప్పే చార్జీలతో విమానం ఎక్కవచ్చని చెబుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు కాని ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులుకాని, పోలీసులు కాని తక్షణం విచారణ జరిపి ప్రయాణికుల సౌకర్యార్థం ఛార్జీల పట్టిను, మే హెల్ప్‌యు డెస్క్‌ను కూడా ఏర్పాటుచేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.





ఏలూరు, చింతలపూడి బోసుబొమ్మ సెంటర్‌లో బీజేపీ నాయకుల ఆనందోత్సాహం

ఢిల్లీలో బీజేపీ ఘన విజయంపై పార్టీ శ్రేణుల సంబరాలు

ఏలూరు రూరల్/ఏలూరు/కుక్కునూరు/ కొయ్యలగూడెం/లింగపాలెం/కామవరపుకోట/చింతలపూడి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే ఢిల్లీ సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ప్రజలు భావించి బీజేపీకి ఘన విజయం కట్టబెట్టారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి అన్నారు. శనివారం ఢిల్లీల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో ఏలూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కన్నేటి కృష్ణప్రసాద్, దాన భాస్కరరావు, గుమ్మడి చైతన్య, బాడిత నారాయణరావు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కుక్కునూరు మండలంలో కూటమి నాయకులు, బీజేపీ విజయంపట్ల సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు, పిచ్చుక రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు తూము వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో కూటమి నాయకులు టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి వాసు, మండల అధికార ప్రతినిధి బొమ్మా బాబు, మోడేపల్లి నాగు, తదితరులు పాల్గొన్నారు. లింగపాలెం మండలంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధరరావు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.కామవరపుకోట మండలంలో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు యేసువరప్రసాద్, మండల అధ్యక్షులు బాలవర్ధిరాజు, చెలికాని భాస్కరరావు, కాకి సురేష్‌కుమార్ బృందం పాల్గొన్నారు. చింత లపూడి బోస్ బొమ్మ సెంటర్‌లో బీజేపీ నాయకులు నారాయణ, మోహన్‌రావు హర్షం ప్రకటించారు.

చారిత్రాత్మక విజయం



ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో మోదీ నాయకత్వంపై ఢిల్లీ ఓటర్లు జైకొట్టారని, పార్టీ చారిత్రాత్మక విజయం సాధించిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకులు అంబికా కృష్ణ అన్నారు. దేశంలో మోదీ అంటేనే విశ్వాసం అని, ప్రజలకు మంచిచేసే పార్టీని ఢిల్లీ ప్రజలు గుర్తించి జై కొట్టారన్నారు. ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌లోనూ పేద, మధ్యతరగతి ప్రజల మేలు కోరేలా బడ్జెట్ రూపొందించారని, మరో 20 ఏళ్ల బీజేపీ దేశాన్ని ఏలుతుందన్నారు.





చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రచారం.. జి.కొత్తపల్లిలో ఎమ్మెల్యే మద్దిపాటి ప్రచారం

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపిద్దాం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోరారు. జి.కొత్తపల్లిలో శనివారం ఆయన కూటమి నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, రేగంటి రాంబాబు, డీవీ చౌదరి, సర్పంచ్ కస్సే శ్రీహరి, రాచమంటి శ్రీను పాల్గొన్నారు.

• చింతలపూడి/లింగపాలెం/జీలుగుమిల్లి, : ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి గెలిపించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో చింతలపూడి ఎమ్మెల్సీ పరిశీలకుడు, బీజేపీ నాయకులు దొరతోపాటు లింగపాలెం మండలం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీజేపీ నాయకులు తోట నారాయణ, ప్రసాద్, మోహన్‌రావు, చక్రధరరావు పాల్గొన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో తాతిన రాధాకృష్ణ ఆధ్వర్యంలో రాజశేఖర్ గెలుపునకు కృషి చేయాలని కూటమి నాయకులు సమావేశమయ్యారు. మోరంపూడి వరప్రసాద్, గారపాటి బుజ్జయ్య, నిమ్మగడ్డ సుధ, చల్లా నాగబాబు, సీ హెచ్ రామ్మోహనరావు, పాతూరి శ్రీనివాసరావు, జి.వెంటేశ్వరరావు, వి.ప్రసాద్ పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో జనసేన పార్టీ కార్యాలయం వద్ద పోలవరం నియోజకవర్గ కూటమి నాయకులతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సమావేశం నిర్వహించారు. పార్టీల నాయకులకు ఎన్నికల ప్రచారంపై దిశ నిర్దేశం చేశారు. గడ్డమణుగు రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, కుక్కునూరు మండల పార్టీ అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి, పిన్నమనేని మధు ఉన్నారు.

డీవీ రాఘవులును గెలిపించాలి : ఇళ్ల

జంగారెడ్డిగూడెం : గ్రాడ్యుయేట్ కోటాలో పెద్దలసభకు ఎన్నికయ్యే అభ్యర్థి స్వతంత్ర అభ్యర్థి అయి ఉండాలని రాజకీయ పార్టీలకు కొమ్ము కాయకూడదని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పీడీఎఫ్ బలపరిచిన డీవీ రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ విజయ్‌ప్రకాష్

త్రీడి ఫార్ములాతో జీవితంలో విజయం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సాధించాలనే కోరిక సంకల్పం, క్రమశిక్షణతో కూడిన త్రీడి ఫార్ములా పాటిస్తే ఏ విద్యార్థి అయినా జీవితంలో విజయం సాధిస్తారని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ అన్నారు. స్థానిక అమీనాపేటలో శనివారం బాలికల వసతి గృహ ప్రాంగణంలో ఏఎస్‌డబ్ల్యూ ఏలూరు ఏరియాలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పుస్తకాలు బాగా చదివిన వారు అన్ని పోటీ పరీక్షల్లో సఫలమవుతారని, సాంఘిక సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ జవాబులు పదేపదే పునశ్చరణ చేయడం ద్వారా అధికమార్కులు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ బి.రమేష్, ఈఎమ్‌హెచ్‌సీ ఏలూరు, డబ్ల్యూహెచ్‌వో కొవ్వలి, వసతిగృహ విద్యార్థులు, వార్డెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

'అవసరాలు తీర్చే దేవుడు ఏసుక్రీస్తు'



సందేశమిస్తున్న సిస్టర్ ఇవాంజిలిన్‌పాల్ దినకరన్

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : ఏ అవసరమైనను తీర్చే దేవుడు ఏసుక్రీస్తు అని అంతర్జాతీయ సువార్తీకులు డాక్టర్ పాల్‌దినకరన్ అన్నారు. శనివారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో మన్నా చర్చి ఆధ్వర్యంలో 'ఏసు పిలుచుచున్నాడు ప్రార్థన పండుగలు' పాస్టర్ ఎం.జ్యోతిరాజు, సిస్టర్ సునీత ఆధ్వర్యంలో కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుకు ప్రార్థన చేస్తే జవాబిస్తాడన్నారు. నీ దుఃఖాలను సంతోషంగా మార్చేదేవుడు ఏసయ్య అని అన్నారు. సిస్టర్ ఇవాంజలిన్‌పాల్ దినకరన్, బ్రదర్ శామ్యూల్ దినకరన్, సిస్టర్ సెల్లా రమూల, డేవిడ్ డానియేల్‌సన్, రెవరెండ్ ఫాదర్ బాల, బిషప్ ఎలీషా రాజు వాఖ్య సందేశం అందించారు. మన్నాచర్చి వర్షిప్ టీమ్‌చే మధురసంగీతం పాటలు, స్తుతి ఆరాధన నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా దేవుని సేవకులు, బిషప్‌లు హాజరయ్యారు. ప్రార్థన పండుగలకు వేలాదిగా జిల్లా నలుమలాలల నుంచి విశ్వాసులు హాజరయ్యారు.

'సోషల్ మీడియాను సద్వినియోగించుకోవాలి'



2కే వాక్‌లో పాల్గొన్న రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

పెదపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సోషల్ మీడియాను దుర్వినియోగ పర్చకుండా సద్వినియోగం చేసుకోవాలని త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో క్రేయ-2025 ఫెస్ట్‌ను పురస్కరించుకుని ఇంజనీరింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో సోషల్ మీడియా నేరాలపై అవగాహన కల్పిస్తూ 2కే వాక్‌ను కళాశాల నుంచి ఇండోర్ స్టేడియం, అక్కడి నుంచి శాంతినగర్ వరకు శనివారం నిర్వహించారు. సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియాను వినియోగించుకోవడంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులకు గురవుతారని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసర పోస్టులకు, కాల్స్, సందేశాలకు స్పందించవద్దన్నారు. అవసరమైతే తక్షణం సైబర్ సెల్ సాయాన్ని పొందాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టరు మురళీధరరావు, డీన్ శర్మ, డాక్టరు ప్రసాద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులను ఆదుకోవాలి

టి.నరసాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వృద్ధ కళాకారులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఏలూరు జిల్లా సమన్వయకర్త టీవీఎస్ ప్రభుత్వాన్ని కోరారు. తిరుమలదేవిపేట గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు కళాకారులు ప్రధాన భూమిక పోషిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం చాలామంది కళాకారులు మంచానికే పరిమితమై దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వృద్ధ కళాకారులకు ఇచ్చే నాలుగు వేల రూపాయలు ఎటూ చాలటం లేదని పది వేలకు పెంచి వారిని ఆదుకోవాలని ఆయన కోరారు.



భక్తుల పాదయాత్ర

టి.నరసాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాదయాత్రగా ద్వారకాతిరుమల వెళ్ళారు. బొర్రంపాలెం, వల్లంపట్ల, వీరభద్రవరం, వెంకటాపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు వందలాది మంది ఉన్నారు. పాదయాత్రగా వెళుతున్న భక్తులకు మార్గమధ్యంలో దాతలు పండ్లు, ఫలహారాలు, మంచినీరు అందజేశారు.

వైద్యసేవలపై రోగులకు అవగాహన కల్పించాలి

పెదపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పలు వైద్యసేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగులకు వారికి అందించే వైద్యసేవలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టరు చక్రధర్ తెలిపారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్యసేవలను పరిశీలించి ఓపీ రికార్డులను తనిఖీ చేశారు. రక్తపరీక్షా కేంద్రం, ఫార్మసి, ఆరోగ్యకేంద్రం పరిసరాలను స్థానిక వైద్యులు ఆనంతపాల్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భీష్మ ఏకాదశి పూజలు





యడవల్లి రామాలయంలో సీతారామలక్ష్మణ హనుమంతుల వారు, భక్తులు

కామవరపుకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : చిన భద్రాద్రిగా పేరొందిన తూర్పు యడవల్లి గ్రామంలో ద్వారకాతిరుమల దేవస్థానం ఉపాలయంగా ఉన్న రామాలయంలో శనివారం భీష్మ ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ హనుమంతుల వారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. సామూహిక పారాయణలు జరిపారు. ఆలయ ప్రాంతం భక్తులతో రామనామస్మరణతో మార్మోగింది.

కృష్ణాపురంలో హనుమాన్ చాలీసా

టి.నరసాపురం : కృష్ణాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా హనుమాన్ చాలీసా శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి బృందం పారాయణం నిర్వహించారు. టి.నరసాపురానికి చెందిన ముళ్ళపూడి సుబ్బారావు దంపతులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు, లింగారెడ్డి శ్రీనివాసరావు, పర్వతనేని మురళి, దేవరపల్లి లక్ష్మణరావు, చాటపర్రుకు చెందిన దివ్యాంగురాలు మాగంటి సంధ్యారాణి, కుప్పాల రామలక్ష్మి, దావులూరి తులసితో పాటు మహిళలు పాల్గొన్నారు.

సంతాన లక్ష్మిగా అచ్చమ్మ పేరంటాలమ్మ



దెందులూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంతానలక్ష్మిగా పేరొందిన గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటలమ్మ ఆలయ 68వ వార్షికోత్స వం సందర్భంగా ఐదో రోజు శనివారం వేద పండితులు, ప్ర ధాన అర్చకులు తిప్పాభట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో 33 రకాల పువ్వులతో అమ్మవారికి అలంకరణ చేశారు. అమ్మవారు పూజారి వారి ఆడపడుచు కావడంతో పుట్టింటి నుంచి అమ్మవారి ప్రతిమతో సంప్రదాయబద్ధంగా బ్యాండు సన్నాయిలతో మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

అమ్మో.. అమెరికానా ?

(ఐదో పేజీ తరువాయి)

అనుకరించేవారు. అయితే వీరి ఆశలను ఏజెంట్లు, దళారులు సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టారు. అక్కడ ఉద్యోగాలు ఇప్పిస్తామని పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడి, విజిటింగ్ వీసాలపై పంపించేవారు. అక్కడకు వెళ్లిన వారు ఉపాధి లేక, లక్షలు పోగొట్టుకుని ఇక్కడకు రాలేక చాలామంది జైళ్లలో బందీలుగా మిగిలిన సందర్భాలు ఉన్నాయి. ఉపాధికి వెళ్లి మృత్యువాత పడుతున్న వారి సంఖ్య తక్కువేమీ లేదు. మరోవైపు అక్కడ ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. పనులు చేసేవారి సంఖ్య పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వల్ల జీతాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఈ కారణాల రీత్యా లక్షలు ఖర్చు పెట్టుకుని, కుటుంబాలను వదిలి గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇబ్బందులు పడడంకంటే ఇక్కడే ఏదొక పని చేసుకోవడం బెటర్ అనే ఆలోచనలో చాలా మంది ఉన్నారు. దీనితో ఈ మధ్య కాలంలో గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య మునుపటిలా లేదు. బాగా తగ్గిపోయింది.

అక్రమంగా వెళ్లారో ఇరుక్కున్నట్టే..!

గల్ఫ్‌తోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలకు ఉపాధి నిమిత్తం అక్రమంగా వెళితే ఇరుక్కున్నట్టే. దళారులను నమ్మి తగిన పత్రాలు లేకుండా సరిహద్దులు దాటితే.. చిక్కుకుపోతాం. 2022 అక్టోబరు నుంచి 2023 సెప్టెంబరు మధ్య తగిన పత్రాలు లేకుండా యూఎస్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన 96,917 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు అక్కడి కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. 2020లో ఎనిమిది వేల మంది 2021లో పది వేల మంది, 2022లో 12 వేల మంది అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపించింది.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం


ఆలయంలో కొలువైన కల్యాణమూర్తులు

ముసునూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ముసునూరులో కొలువైన ప్రసన్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహచార్యుల వేదమంత్రోచ్ఛారణలతో వేలాది మంది భక్తుల నడుమ 11 మంది దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం స్వామివార్ల కల్యాణమూర్తులను మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. తొలుత స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనకు భక్తులు అధిక సంఖ్యలో తరలావచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా యోగాంజనేయ స్వామికి తమలపత్రార్చన

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శోభనాచల లక్ష్మీనరసింహ స్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలోని యోగాంజనేయ స్వామికి తమల పత్రార్చనను వైభవంగా జరిపించారు. శోభనాచల స్వామికి అష్టోత్తర శతకలశ స్నపన, స్వామికి విశేషాలంకరణను అర్చకులు జరిపారు. అనంతరం ఆలయంలోని యోగాంజనేయ స్వామికి ఉత్సవ శాంతిలో భాగంగా పంచామృత స్నపన, సహస్ర తమల పత్రార్చన, అప్పాలు నివేదన, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగాలను అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ ఘనంగా నిర్వహించారు.

జగదీష్‌కు మంత్రి, మాజీ ఎంపీ ఫోన్‌లో పరామర్శ

చాట్రాయి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురుగూడేనికి చెందిన నియోజకవర్గ తెలుగు రైతు నాయకుడు మందలపు జగదీష్ మాతృమూర్తి సరోజిని దశదిన కర్మ సోమవారం నిర్వహించ నున్నారు. జగదీష్ మాతృమూర్తి సరోజిని ఇటీవల మృతి చెందడంతో నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు శనివారం ఫోన్‌లో జగదీష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుగూడెంలో నిర్వహించే దశదిన కర్మకు పలువురు రాజకీయ ప్రముఖులు వస్తున్నట్టు తెలిపారు.

తోటపల్లిలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో శ్రీ దుగ్గిరాల బాలరావమ్మ తల్లి తిరునాళ్ళు 10,11,12 తేదీల్లో జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాల ని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి 'వందేభారత్'కు ఏలూరులో హాల్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌలభ్యం కోసం సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 25వ తేదీ నుంచి ఏలూరులో హాల్ట్ కల్పించినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందేభారత్(20707) ఉదయం 9.49 గంటలకు ఏలూరు చేరుకుంటుంది. ఈ నెల 26 నుంచి విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ (20708) రైలు సాయంత్రం 5.44 గంటలకు ఏలూరులో ఆగుతుంది. ఏలూరు స్టేషన్‌లో వందే భారత్ రైళ్లు నిమిషం పాటు ఆగుతాయని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు.


కైకలూరు మండలం ఆచవరంలో కనుమరుగైన పుల్లవా డ్రెయిన్

ముంచుతున్న డ్రెయిన్లు

దశాబ్దాల నుంచి ఆధునికీకరణ మరిచారు


కైకలూరులో కుచించుకుపోయిన శాంప్ డ్రెయిన్

కైకలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలో పెదలంక మేజర్ డ్రెయిన్, పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు, దమ్మిడి, పుల్లవా, శాంప్ డ్రెయిన్, పోల్‌రాజ్ డ్రెయిన్లు ఆధునీకరణకు నోచుకోలేదు. 2013 నుంచి నేటి వరకు డ్రెయిన్ల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. 2015లో పోల్‌రాజ్ డ్రెయిన్ తవ్వకాలు చేపట్టినప్పటికీ మరలా కిక్కిస పెరిగి యథాస్థితికి చేరుకుంది. నియోజకవర్గంలో సుమారు 4 లక్షల ఎకరాల పంట భూములు ఉండగా వాటిలో 60 నుంచి 70వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేస్తున్నారు. మిగిలిన భూములన్నీ ఆక్వా చెరువులకు మార్చివేశారు. ఏటా వర్షాకాలంలో పంటలు ముంపు బారిన పడడంతో ప్రత్యామ్నాయంగా రైతులు ఆక్వా వైపు మళ్లారు. ప్రభుత్వాలు డ్రెయిన్ల ఆధునీకీకరణను పూర్తిగా విస్మరించాయి. వైసీపీ పాలనలో పెదలంక మేజర్ డ్రెయిన్లో రూ.25 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు చేపట్టినా పూర్తిస్థాయిలో నిర్వహించకుండా కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. మేజర్ డ్రెయిన్లతో పాటు నియోజకవర్గంలో సుమారు 30 మీడియం డ్రెయిన్లు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఎక్కడికక్కడే ఆక్రమణ, పూడికతో డ్రెయిన్లు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పుల్లవా డ్రెయిన్‌తో కైకలూరు మండలం ఆచవరం, గోపవరం రోడ్డు అగ్రహారం రోడ్డు ఏటా మునుగుతోంది. తామరకొల్లు - పెదకొమ్మిలేరు డ్రెయిన్ ఉప్పుటేరు వరకు పెద్దఎత్తున కిక్కిసకర్ర దట్టంగా అలుముకోవడంతో నీటి ప్రవాహం తగ్గిపోయింది. సముద్రపు పోటు తగలడంతో ఉప్పుటేరు నీరు ఈ డ్రెయిన్లకు ఎదురువస్తుంది. ఈ నీరు తాడినాడ, పోతుమర్రు, కొండూరు, కాళ్ళపాలెం గ్రామాల్లోని వేలాది ఎకరాల చేపల చెరువులకు తోడుకుం టారు. చిన్నకొమ్మిలేరు డ్రెయిన్ అనేకచోట్ల కనుమరగయ్యే పరిస్థితి నెలకొంది. డ్రెయినేజీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డ్రెయిన్లు కనుమరుగవు తున్నాయి. ఆక్రమణలపై అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వం డ్రెయిన్ల అభివృద్ధిపై దృష్టి సారించి ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని రైతులు కోరుతున్నారు.


తామరకొల్లు వద్ద డ్రెయిన్‌లో పేరుకుపోయిన కిక్కిసకర్ర

తాగునీటి చెరువులకు నీటి సరఫరా


మట్టగుంటలో తాగునీటి చెరువును పరిశీలిస్తున్న ఏఈఈ ఫణి

కలిదిండి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులకు కాల్వల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని ఇరిగేషన్ ఏఈఈ ఫణి తెలిపారు. శనివారం మట్టగుంట, కొండంగి, మూల్లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి చెరువులకు నీటి వంతు వెళ్తుండగా, చేపల చెరువులకు నీరు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. ప్రస్తుతం కొండంగి, మట్టగుంట తాగునీటి చెరువులకు నీటి సరఫరా చేస్తున్నామన్నారు. పెదలంకలో చెరువు ఎండగట్టడంతో కాల్వకు నీటి విడుదల మట్టాన్ని పెంచి పూర్తిస్థాయిలో చెరువు నింపడానికి చర్యలు తీసుకుంటామ న్నారు. కొండంగి, మట్టగుంట సర్పంచ్‌లు తిరుమలశెట్టి జ్యోతి, అంద్రాజు రత్నమణి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎ.దుర్గారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టీ పరిశీలకులు వీరంకి గురుమూర్తి, మెంటే పార్థసారథి, కూటమి నేతలు

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

కైకలూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు వీరంకి గురుమూర్తి, మెంటే పార్థసారథి అన్నారు. శనివారం కైకలూరులో ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్లు కొడాలి వినోద్, బలే ఏసురాజు పాల్గొన్నారు.


వడాలి జగన్నాథస్వామి ఆలయంలో పారాయణం నిర్వహిస్తున్న మహిళలు

భీష్మ ఏకాదశి పూజలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ముదినేపల్లి మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడాలిలోని శ్రీ సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానంలో ఏకాదశి విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. స్వామికి పూజలు, అభిషేకాలు, నారాయణార్చన నిర్వహించారు. ముదినేపల్లిలోని పెదరామాలయం, సూర్యనారాయణపురం, పెదగొన్నూరు, వాడవల్లి, పెదపాలపర్రు, గురజ రామాలయాలు, వేణుగోపాలస్వామి దేవస్థానాల్లో భీష్మ ఏకాదశి పూజలు నిర్వహించారు.


వరహాపట్నంలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

బీజేపీ విజయోత్సవాలు

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ అధికారాన్ని చేజిక్కించు కోవడం హర్షణీయమని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు మండలం వరహాపట్నంలోని ఆయన స్వగృహం వద్ద బీజేపీ విజయం సాధించడం పట్ల కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతూ విజయో త్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోటప్రోలు కృష్ణారావు, సమయం ఏసుబాబు, చిట్టూరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ విజయం సాధిం చడం పట్ల కైకలూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, కిసాన్‌మోర్చ నాయకుడు కీర్తి వెంకటరాంప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలో బీజేపీ గెలుపొం దడం పట్ల కలిదిండి మండల కూటమి నాయ కులు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నున్న రమాదేవి, ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, అంద్రాజు శ్రీనివాస్, చెన్నంశెట్టి మురళీకృష్ణ, కేశిరెడ్డి బలరామ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు శనివారం ముదినేపల్లి మండలం సింగరాయపాలెం సెంటర్‌లో సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి విజయోత్సవం జరుపుకున్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షుడు పసుపులేటి నరసింహారావు, కార్యదర్శి నీలం మల్లేశ్వరరావు, రైల్వే స్టేషన్ కమిటీ సభ్యుడు మేలిమి చిట్టిబాబు, నాయకులు పుప్పాల శేషుబాబు, నచ్చిరెడ్డి వెంకన్న పాల్గొన్నారు.


సింగరాయపాలెం సెంటరులో బీజేపీ నాయకులు విజయోత్సవం

రేపటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కైకలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎన్జీవోహోంలో నులిపురుగుల నివారణ దినోత్సవంపై అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నుంచి నులిపురుగుల మాత్రలను ప్రభుత్వ ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు అందజేయాలని వైద్యాధికారులు కె.అన్నపూర్ణ, ఎల్. కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని 14,750 మంది ఏడాది నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలున్నారని వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందజేయాలన్నారు.

ఆర్బీకే భవనాల్లో నీటి సంఘాల కార్యాలయాలు?

అధికారుల సూచనలు

ప్రభుత్వ పరిశీలన

ముదినేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాలకు భవన సౌకర్యం ఏర్పాటు కానుంది. ఈ సంఘాల కార్యాలయాలను రైతు సేవా కేంద్రాల (పూర్వపు రైతు భరోసా) భవనాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు సంఘాలకు కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. 2019 నుంచి 2024 వరకు సంఘాల ఉనికే లేదు. తిరిగి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక నీటి సంఘాలు తెర మీదకి వచ్చాయి. ఎన్నికలు జరిగి పాలక వర్గాలు ఏర్పడ్డాయి. అయితే సంఘాల కార్యకలాపాలు నిర్వహించేందుకు కేరాఫ్ అడ్రస్ అంటూ లేకుండా పోయింది. సంఘ సర్వసభ్య సమావేశాలను ఆయా ప్రధాన పంట కాల్వల సెక్షన్ కార్యాలయాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థల అభివృద్ధిలో నీటి సంఘాల ప్రాధాన్యత పెరిగినందున సాగునీటి సంఘాలకు కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ఈ కార్యాలయాలకు కొత్తగా భవనాలను నిర్మించాల్సిన అవసరం లేకుండానే ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల భవనాల్లో ఏర్పాటు చేస్తే సరిపోతుందని, అన్ని సంఘాల హెడ్ క్వార్టర్స్‌లోను ఈ భవనాలు న్నాయని జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. ఈ భవనాల్లో వ్యవసాయ శాఖ కార్యక్రమాలు మాత్రమే జరుగుతుండగా, కొంత భాగాన్ని సాగునీటి సంఘాల కార్యాలయానికి వినియోగించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

బీజేపీ శ్రేణుల సంబరాలు



నూజివీడు, చాట్రాయి సెంటర్లలో బీజేపీ నాయకుల సంబరాలు

నూజివీడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో బీజేపీ ఘనవిజయం సాధించడంతో నూజివీడులో ఆ పార్టీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. శనివారం చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జరిగిన సంబరాల్లో పార్టీ నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ పార్టీ నినాదాలు చేశారు. 27 సంవత్సరాల ఢిల్లీ రాజకీయ చరిత్రని ప్రధానిమోదీ తిరగరాశారని నాయకులు పేర్కొన్నారు. సుస్థిర, సుపరిపాలన, సర్వతోముఖాభివృద్ధితో పాటు దేశ సమైక్యత, సమగ్రతలు బీజేపీ పాలన వల్లే సాధ్యమనే విషయాన్ని ఢిల్లీ ప్రజలు తమ తీర్పు ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. పార్టీ నాయకులు బోను అప్పారావు, వై.ఎస్. దొరై, ఎం.రాజశేఖర్, శివరాజు వసుందరాదేవి, మాటూరి రవికాంత్, మాగంటి వాసు మాస్టరు, బావరాజు పుల్లారావు, రాయపాటి విజయ లీలాజ్యోతి పాల్గొన్నారు.

- చాట్రాయి : చాట్రాయి మండలంలోని చనుబండ సెంటర్‌లో శనివారం కూటమి శ్రేణులు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కూటమి ఐక్యత వర్థిల్లాలి, నరేంద్ర మోదీ జిందాబాద్ అంటూ శ్రేణులు నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనమని, సుస్థిర సుపరిపాలన, సమగ్ర అభివృద్ధి, దేశ సమైక్యతకు ఢిల్లీ ప్రజలు పట్టం కట్టి, అవినీతి పాలనకు చరమగీతం పాడారని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, నెక్కలపు వెంకటేశ్వరరావు, బజ్జూరి గోపి, కందుల కృష్ణ, ఆదిమూలం శర్మ, బన్నే వీరాస్వామి, విద్యాధరరెడ్డి, వెంకటేశ్వరరావు, రమేష్, నరసింహారావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఆగిరిపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆగిరిపల్లి టీడీపీ మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లెల రాజశేఖర్ గౌడ్, టి.టి.డి బోర్డు సభ్యులు, టీడీపీ నంద్యాల అధ్యక్షులు, గింజుపల్లి రమేష్ పాల్గొన్నారు. ఆగిరిపల్లిలోని పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మడుపల్లి గోపాల్, చిట్టినేని శివరామకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కనబోయిన వేణు, విక్టర్‌బాబు, నరసయ్య, ఏసుపాదం, తదితరులు పాల్గొన్నారు.

సమాజ దిశానిర్దేశకులు ఉపాధ్యాయులే


విరాళం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సన్మార్గంలో నడిపించి సమాజాభివృద్ధికి కృషి చేసేది ఉపాధ్యాయులేనని రిసోర్సు పర్సన్ పి.వెంకటరమణ అన్నారు. మండలంలోని తోటపల్లిలో నిర్వహించిన ఫౌండేషన్ లీటరసి, న్యూమరసీ 9వ బ్యాచ్ శిక్షణ ముగింపు సమా వేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ మేరకు రీసోర్స్‌పర్సన్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యాబోధనకు ఈ శిక్షణ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులందరి తరపున లక్షా 75వేల రూపాయల విరాళాన్ని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు సత్యప్రసాద్‌కు ఉపాధ్యాయ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, అకాడమిక్ మోనటరింగ్ అధికారి రెడ్డి రామారావు, దాసరి మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

ముసునూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ కార్యాక్రమంలో భాగంగా ముసునూరు గురుకుల బాలికలకు వైద్యాధికారిణి డాక్టర్ ఇవాంజలి కళ్లజోళ్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటిచూపు ఎక్కువ కాలం ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే బాలికల్లో రక్తహీతన రాకుండా తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ నిలిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలకు మాత్రలను అందజేశారు. ప్రిన్సిపాల్ కె.ప్రవీణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.